ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY




పెన్షన్.. టెన్షన్..

అడ్డదారిలో సామాజిక పింఛన్లు పొందుతున్న నకిలీ లబ్ధిదారుల గుండెల్లో టెన్షన్ మొదలైంది. లబ్ధిదారుల్లో అర్హులు ఎవరో అనర్హులు ఎవరో తేల్చాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. అనర్హులను ఏరివేసి వారికి పింఛన్లు కట్ చేయాలని ఆదేశాలు రావడంతో లబ్ధిదారుల వెరిఫికేషన్ ప్రారంభించారు. గతంలో సదరం క్యాంపుల ద్వారా ఫించన్ పొందేవారి సంఖ్య ధ్రువీకరణ పత్రాలు పొందిన వారికి తిరిగి వైద్యులతో పునఃపరిశీలన జరుగుతోంది. వైసీపీ ఐదేళ్లకాలంలో వికలాంగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కేవలం ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లు పొందేందుకే చాలా మంది వికలత్వపు ధ్రువపత్రాలు పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో పింఛన్ పొందుతున్న దివ్యాంగులందరికీ తిరిగి వైద్య పరీక్షలు గత నెల 27వ తేదీ నుంచి ప్రారంభం అయ్యాయి.

- ఉమ్మడి జిల్లాలో 35,787 మంది వికలాంగులకు పింఛన్
- వీరందరికీ నాలుగుచోట్ల వైద్య పరీక్షలు
- వైసీపీ హయాంలో వందలాది బోగస్‌లు
- తేలనున్న దివ్యాంగుల లెక్క
- బోగస్ పింఛన్‌దారుల్లో భయం


పులివెందుల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

కడప ఎన్జీఆర్ సర్కిల్/పులివెందుల టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛను మొత్తాన్ని పెంచింది. దివ్యాంగులకు రూ.6వేలు, కండరాల బలహీనత, పక్షవాతం తదితర జబ్బులతో బాధపడుతున్న వారికి రూ.10 వేలు, దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టిన వారికి రూ.15వేలు ఇస్తోంది. జిల్లాలో మంచానికే పరిమితమైన వారు 530 మంది ఉన్నారు. వీరి ఇళ్లకు వెళ్లి వైద్య బృందం ఇప్పటికే తనిఖీలు పూర్తిచేసింది. ఒక ఆర్థోపెడిక్ వైద్యుడు, జనరల్ ఫిజీషియన్‌తో పాటు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారితో కూడిన బృందం వెళ్లి పరిశీలించింది. ఇప్పుడు మిగతా దివ్యాంగులకు సంబంధించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు జరుగుతున్నాయి.

35,787 మంది లబ్ధిదారులు

జిల్లాలో 35,787మంది దివ్యాంగులు పింఛన్ పొందుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఆర్థోకు సంబంధించి 17,243 మంది, కంటిచూపు సరిగా లేని వారు 3,626 మంది, వినికిడి లోపం ఉన్న వారు 9,297 మంది, మానసిక వికలాంగులు 5,314 మంది ఉన్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాం నుంచి వేలాది మంది అనర్హులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో లబ్ధి పొందుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనితో రాష్ట్ర వ్యాప్తంగా వికలత్వపు పింఛన్లపై సమగ్ర విచారణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జనవరి 27న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ మాసాంతం వరకు కొనసాగే అవకాశాలు ఉన్నాయి. ఇందుకు అనుగుణంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందించారు. వికలత్వపు పింఛన్ పొందుతున్న వారికి క్షేత్రస్థాయిలోని డీఆర్‌డీఏ సిబ్బంది ఏ తేదీన ధ్రువీకరణకు హాజరుకావాలనే విషయం లబ్ధిదారులకు ముందే తెలియజేస్తున్నారు. కాగా.. జిల్లాలో ఇప్పటివరకు ఈఎన్‌టీకి సంబంధించి 775 మందికి, ఆర్థో 1200, వినికిడి లోపం ఉన్నవారు 900, మానసిక వికలాంగులు 675 మందికి రీ వెరిఫికేషన్ పూర్తి చేశారు. మిగలిన వారిని పరిశీలిస్తున్నారు. గత వైసీపీ హయాంలో ఒక్క పులివెందుల నియోజకవర్గంలోనే 2వేల పైబడి నకిలీ పింఛన్లు మంజూరు చేయించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరందరూ ఇప్పుడు ఆయా వార్డుల్లోని అధికార పార్టీ నాయకులు, కౌన్సిలర్ల వద్దకు పరుగులు పెడుతున్నారు. ఎలాగైనా తమ పింఛను పోకుండా చూడాలని నాయకులను ప్రాధేయపడుతున్నారు. పరీక్షలకు వస్తున్న వారిలో 30 శాతం వరకు అనర్హులున్నట్లు తెలుతోందని సమాచారం. ఆ విషయాన్ని వైద్యులు బయటికి చెప్పడంలేదు. అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

పకడ్బందీగా రీ వెరిఫికేషన్..

ప్రభుత్వం నుంచి వచ్చిన తాజా ఆదేశాల మేరకు దివ్యాంగుల గుర్తింపు ప్రక్రియ జరుగుతుంది. పకడ్బందీగా రీ వెరిఫికేషన్ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతాం. అక్కడ పర్సంటేజీల ఆధారంగా పెన్షన్‌దారులను ఎంపిక చేస్తారు. జిల్లావ్యాప్తంగా దివ్యాంగులను క్షుణ్ణంగా పరిశీలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటి వరకు 3,500 మందికి వెరిఫికేషన్ పూర్తిచేశాం.

- ఆనంద్ నాయక్,
డీఆర్‌డీఏ పీడీ

ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ప్రభుత్వం ప్రత్యేక జాబితా వెల్లడించే అవకాశం ఉంది.

నాలుగు కేంద్రాలు ఏర్పాటు


కడప రిమ్స్, ప్రొద్దుటూరు జీజీహెచ్, పులివెందుల వైఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే ఆయా కేంద్రాలకు వచ్చే దివ్యాంగులకు, వారి సహాయకులకు భోజన వసతి ఏర్పాటు చేయలేదు. దీంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడో మారుమూల గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. డీఆర్‌డీఏ నిర్వహణలో జీజీహెచ్‌లలో పరీక్షలు ఏర్పాటు చేశారు. రోజుకు 700 మంది దివ్యాంగులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు.


రీవెరిఫికేషన్‌కు హాజరైన పెన్షన్‌దారులు

రేపటి నుంచి జిల్లా రచయితల సంఘం మహాసభలు

- కడపలో రెండురోజుల పాటు నిర్వహణ

కడప కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం మహాసభలు కడపలోని ఐఎంఏ హాల్‌లో 8, 9వ తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు మహాసభల వివరాలను కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి గురువారం వెల్లడించారు. 'వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం-రాయలసీమ భాగస్వామ్యం' అనే అంశంపై ఈ సభలు ఉంటాయన్నారు. రాయల సీమ అస్తిత్వాన్ని, భాగస్వామ్యాన్ని విశ్లేషించేలా సభలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదికవి నన్నయ్య కన్నా నన్నెచోడుడు ముందువాడనే వాదన ఉందని, ఈ నన్నెచోడుడు కడప జిల్లావాసి అని విమర్శకుల అభిప్రాయం అన్నారు. ఈ కోణంలో చూసినప్పుడు తొలి తెలుగు శాసనంతో పాటు ఆదికవిని కూడా రాయలసీమ అందించిందన్నారు. గ్రేటర్ రాయలసీమలో భాగంగా చూసినప్పుడు తిక్కన నెల్లూరువాసిగా, కవిత్రయంలో రెండోవాడుగా, భారత రచనలో అభినవ వ్యాసుడుగా కీర్తి గడించాడన్నారు. నాచన సోమన, బద్దెన, శ్రీనాథుడు, పోతన, అన్నమయ్య తాళ్లపాక తిమ్మక్క అష్టదిగ్గజ కవులైన అల్లసాని పెద్దన, భట్టుమూర్తి, అయ్యలరాజు రామభద్రుడు, పింగళి సూరన తదితర కవులు.. అనంతరం వేమన, పోతులూరి వీరబ్రహ్మం, తరిగొండ వెంగమాంబ తదితర కవులు, కవయిత్రులు అభ్యుదయ పంథాలో నడిచారని వీరంతా రాయలసీమవారే అన్నారు.



8వతేదీ ఉదయం 9గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలతో సభలు ప్రారంభమవుతాయన్నారు. రెండురోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో రాయలసీమ చరిత్ర, సంస్కృతి, సాహిత్యం తదితర అంశాలపై 32 మంది పరిశోధకులు పత్ర సమర్పణలు చేస్తారని, 150మందికి పైగా కవులు విద్యార్థులతో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మొదటిరోజు శ్రీకృష్ణ దేవరాయల సభావేదికపై 17 పుస్తకాలను ఆవిష్కరించనున్నామని తెలిపారు. కడప జిల్లా చరిత్రలోనే ఒకేరోజు ఒకే వేదికపై ఇన్ని పుస్తకాలను ఆవిష్కరించనుండటం ఇదే మొదటిసారి అన్నారు. రెండు రోజులపాటు జరిగే జిల్లా రచయితల మహాసభలను సాహితీప్రియులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

- ఆర్జేడీ రవి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్జేడీ రవి తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఇవన్నీ నేరుగా రాష్ట్ర, జిల్లా కార్యాలయాలకు అనుసంధానమై ఉంటాయని స్పష్టం చేశారు. గురువారం నగరంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల సెమినార్ హాల్లో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య అధ్యక్షతన సైన్స్ అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. విధి విధానాలు, ప్రాక్టికల్స్ మార్కులపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ జనరల్ విద్యార్థులకు 10వ తేదీ నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం అవుతాయన్నారు. ఈ పరీక్షలు జిల్లావ్యాప్తంగా 78 కేంద్రాల్లో నిర్వహిస్తామని ఈనెల 25వ తేదీతో ముగుస్తాయన్నారు. ఎటువంటి అలసత్వం వహించకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి మురళి, పీసీ సభ్యులు పాల్గొని పలు సూచనలు తెలిపారు.


మాట్లాడుతున్న ఆర్జేడీ రవి

సెంట్రల్ జైలు పర్యవేక్షణాధికారిగా రాజేశ్వర్‌రావు



కడప క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైలు పర్యవేక్షణాధికారిగా రాజేశ్వర్‌రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన కడప సెంట్రల్ జైలు ఇన్‌చార్జి పర్యవేక్షణ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పని చేసిన ప్రకాశ్‌ను నెల్లూరుకు బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న రాజేశ్వర్‌రావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయనను రెగ్యులరైజ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, చిత్రంలో జేసీ అదితిసింగ్, కమిషనర్ మనోజ్‌రెడ్డి



ప్రతి ఇంటా ప్రగతి

- అదే పి-4 పాలసీ లక్ష్యం
- కలెక్టర్ చెరుకూరు శ్రీధర్

కడప కలెక్టరేట్, ఫబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇంటినీ ప్రగతి పథంలో నడిపించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పి-4 పాలసీని అమలు చేస్తోందని కలెక్టర్ చెరుకూరు శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా దూరం చేసే దిశగా ప్రభుత్వం అమలు చేయనున్న పి-4 ప్రణాళికపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జీరో పావర్టీని సాధించే దిశగా ముఖ్యమంత్రి రానున్న ఉగాది నాడు ప్రారంభించనున్న పి-4 (పబ్లిక్ పీపుల్స్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) పాలసీ అమలుపై గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఎన్జీవోలు, ఎన్ఆర్ఐలు, వ్యాపారస్తులు, స్థానిక నాయకులు, వివిధ రంగాల నిపుణులను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రభుత్వం జీరో పావర్టీలో భాగంగా పి-4 విధానంపై అందరి ఆలోచనలు, అభిప్రాయాలను సేకరిస్తోందన్నారు. ఈ ప్రక్రియ శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అదితిసింగ్, జడ్పీ సీఈవో ఓబులమ్మ, కడప కమిషనర్ మనోజ్ రెడ్డి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉర్దూ విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం

- మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్


కొత్తకొట్టాల ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఏ షరీఫ్

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించడానికి కృషి చేస్తామని మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్ పేర్కొన్నారు. గురువారం ప్రొద్దుటూరు పట్టణంలోని ఉర్దూ విద్యాసంస్థలను సందర్శించారు. మొదట ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలను సందర్శించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, లైబ్రరీ, డిజిటల్ క్లాస్‌రూము ఏర్పాటు చేయాలని కోరారు. ఉర్దూ పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందజేయాలన్నారు. 16 సంవత్సరాలుగా పనిచేస్తున్నా తమకు వేతనాలు పెంచడంలేదని అధ్యాపకులు తెలిపారు. అనంతరం ఆయన కొత్తకొట్టాలు, మోడంపల్లె మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో వారి సమస్యలను తెలుసుకున్నారు. అమృతానగర్‌లో మైనార్టీ బాలబాలికల కోసం నిర్మించిన ఉర్దూ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలను పరిశీలించారు.

అప్పుల ఊబిలోకి నెట్టిన వైసీపీ

గత వైసీపీ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్ల రూపాయల అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఎంఏ షరీఫ్ విమర్శించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రొద్దుటూరు పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ముస్లిం మైనార్టీలు విద్యతోపాటు ఇతర రంగాల్లో వెనుకబడ్డారని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం రూ.500 కోట్లు సబ్సిడీ రుణాలను మంజూరు చేసిందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు చేతివృత్తులు, చిరువ్యాపారులకు రూ.5 లక్షల రుణాలు మంజూరు చేస్తామన్నారు. మసీదులలో ఇమామ్‌లు, మౌజంలకు వేతనాలు పెంచి అందజేస్తామన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు సీఎం సురేశ్‌నాయుడు, వీఎస్ ముక్తియార్, టీడీపీ నాయకులు ఖలీల్, తాతయ్య, జనసేన నాయకుడు జిలానీబాష పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కోఆపరేటివ్‌లో.. అవినీతి అనకొండ



(కడప-ఆంధ్రజ్యోతి): ఆయన ఓ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. 1993లో సహకారశాఖలో ఉద్యోగిగా చేరాడు. అప్పటికి ఆయనకు ఆస్తిపాస్తులేమీ లేవు. అంచెలంచెలుగా ఉద్యోగంలో పైకి ఎదిగి వచ్చినట్లు.. ఆర్థికంగానూ, అక్రమాల్లోనూ ఎదిగాడు. ఉద్యోగాన్ని అడ్డుపెట్టుకుని ఏకంగా రూ.వంద కోట్లకు పైగా ఆస్తులు సంపాదించుకోవడం సహకారశాఖలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు ఆ సారు పదోన్నతి రేసులో ఉండడం గమనార్హం. ఆ సారు మామూలుగా ఉన్నప్పుడే కోట్లు గడించారు.. ఇప్పుడు బాస్ అయితే ఇంకెన్ని కోట్లు ఊడ్చేస్తారో అంటున్నారు. జిల్లాలో వివిధ చోట్ల పనిచేసిన ఆ సారు ఇప్పుడు ప్రొద్దుటూరు కోఆపరేటివ్‌లో పనిచేస్తున్నారు. ఈయన వ్యవహార శైలిపై కూటమి ఎమ్మెల్యేలు భగ్గుమంటున్నారు. సారు అవినీతి చిట్టాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

ఆ సారు రూటే వేరు

1993లో సహకారశాఖలో ఉద్యోగం పొందిన ఈ సారుకు పెద్ద చరిత్రే ఉందంటారు. ఆయనపై నాటుబాంబులు, తుపాకీ కేసులు ఉండడం గమనార్హం. ఈయన గతంలో కడప జిల్లా సహకార బ్యాంకులో సేల్ ఆఫీసరుగా, ఆర్బిట్రేటర్‌గా పనిచేశారు. రైతులు పంటల సాగు కోసం, ట్రాక్టర్ల కోసం భూములను తనఖా పెట్టి సహకార బ్యాంకులో రుణాలు తీసుకుంటుంటారు. వాటిని సకాలంలో చెల్లించకపోతే వేలం వేస్తుంటారు. అప్పట్లో డీకేటీ భూములు కూడా తనఖా పెట్టి రుణాలు తీసుకున్నారు. ఈ సారు హయాంలో సొసైటీలో రుణాలు తీసుకుని చెల్లించలేకపోయిన రైతుల భూములను.. ఈయన పైస్థాయి అధికారితో కుమ్మక్కై అతి తక్కువ ధరకు వేలానికి వేసి తనకు కావాల్సిన వారి పేరుతో రిజిస్టర్ చేయించుకున్నారంటారు. వాస్తవంగా డీకేటీ భూములు రిజిస్టర్ కావు. అయినా ఈ సారు చక్రం తిప్పారంటారు. ఈ సారు ప్రస్తుతం ప్రొద్దుటూరులో పనిచేస్తున్నారు. ఈ డివిజను పరిధిలో కింది స్థాయి ఉద్యోగులను భయపెట్టి లంచాలు తీసుకుంటారంటారు. అక్రమ సంపాదన కోసం అర్హత లేకున్నా సరే బంధువులను ఉద్యోగులుగా నియమించారంటారు. కడప కేడీసీ బ్యాంకులో పనిచేసేటప్పుడు అనర్హులకు డబ్బులు తీసుకుని పదోన్నతులు ఇచ్చారనే ఆరోపణలున్నాయి. జమ్మలమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో భారీ ఎత్తున నిధులు గోల్‌మాల్ జరిగాయంటారు. ఇతను అక్కడి అధికారితో కుమ్మక్కై.. అతడిపై కేసు లేకుండా చేసేందుకు ఆ అధికారి స్థలాన్ని ఈసారు లంచం రూపంలో రాయించుకున్నట్లు చెబుతారు. చింతలమడుగుపల్లె పీఏసీఎస్‌లో ఈయన బినామీలకు రుణాలు ఇచ్చారు. వీరిపై అప్పటి ప్రొద్దుటూరు డివిజనల్ అధికారి సెక్షన్ 51 కింద క్రిమినల్ కేసుకు సిఫారసు చేశారు. అప్పట్లో మేనేజ్ చేసి ఈయన తప్పించుకున్నాడని సమాచారం. ప్రొద్దుటూరు హౌస్‌బిల్డింగ్ సొసైటీలో కొందరు సిబ్బంది నుంచి డబ్బులు బాగా దండుకుని అక్రమమార్గంలో ప్రమోషన్ ఇచ్చారంటారు.

కోట్లాది రూపాయల బినామీ ఆస్తులు

- ఈ సారుకు వీరపునాయునిపల్లె మండలం లింగాలలో తల్లి పేరిట 19.50 ఎకరాలు, భార్య పేరిట 12 ఎకరాలు.. మొత్తం 31.5 ఎకరాల భూమి ఉంది. గతంలో పనిచేసిన తహశీల్దారు ద్వారా తప్పుడు రికార్డులతో ఈ భూములు కొట్టేశారు. ఈ భూములను తనఖా పెట్టి వేంపల్లె మండలంలోని చింతలమడుగు సహకారసంఘం ద్వారా రుణాలు తీసుకున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో సెక్షన్ 51 మేరకు విచారణ చేపట్టగా అప్పట్లో డీసీవోను మేనేజ్ చేసి బయటపడ్డారంటారు.
- అల్లాడుపల్లె సహకార సంఘంలో భార్య కూతురి పేరిట రూ.21 లక్షలు, ప్రొద్దుటూరు టౌన్ బ్యాంకులో కూతురు పేరిట రూ.30 లక్షలు, జమ్మలమడుగు టౌన్‌బ్యాంకులో భార్య పేరిట రూ.7.50లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు చెబుతారు.
- అక్రమంగా సంపాదించిన డబ్బుతో ప్రొద్దుటూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారంటారు. భారీ ఎత్తున వెంచర్లలో కొనుగోలు చేసినట్లు చెబుతారు. ఉద్యోగంలో చేరిన 32 ఏళ్లలో సుమారు రూ.వంద కోట్ల మేర ఆస్తులు సంపాదించి రికార్డు సృష్టించారంటారు. ఈయన అవినీతిపై విచారణ జరిపించాలంటూ ఇప్పటికే ప్రభుత్వానికి పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. పొరుగు జిల్లాల అధికారులతో విచారణ చేయిస్తే ఈ సారు అక్రమ ఆస్తులు బయటపడడంతో పాటు అడ్డగోలు వ్యవహారాలు, విధి నిర్వహణలో చేసిన అక్రమాలు బయడపడతాయని కూటమి ఎమ్మెల్యేలు అంటున్నారు. మరి అధికారులు ఏమేరకు స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

అంతా డ్రోన్లతోనే..!

- ఎరువుల నుంచి మందుల పిచికారీ వరకు..
- వ్యవసాయ డ్రోన్లకు పెరుగుతున్న డిమాండ్
- 80 శాతం సబ్సిడీ.. మండలానికి ఒక్కటే
- ఖర్చు తక్కువ.. రైతు గ్రూపులకు ఆదాయం

6



వైభవంగా చక్రస్నానం

- హంస వాహనంపై విహరించిన వీణాధరుడు
- ధ్వజావరోహణంతో ముగిసిన దేవుని కడప బ్రహ్మోత్సవాలు

7



అంతా డ్రోన్లతోనే...!

- ఎరువుల నుంచి మందుల పిచికారీ వరకు...
- వ్యవసాయ డ్రోన్లకు పెరుగుతున్న డిమాండ్
- 80 శాతం సబ్సిడీ...మండలానికి ఒక్కటే
- ఖర్చు తక్కువ... రైతు గ్రూపులకు ఆదాయం


వరి పైరుకు మందులు పిచికారీ చేస్తున్న డ్రోన్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన పథకం కింద వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రవేశపెట్టిన వ్యవసాయ డ్రోన్లను రైతుల్లో డిమాండ్ పెరుగుతోంది. పురుగుమందుల పిచికారీ, నీటిలో కలసిపోయే ఎరువుల పిచికారీ, పూత కాపాడే మందుల పిచికారీ తదితర పనులను అవలీలగా చేసే ఈ వ్యవసాయ డ్రోన్ల వినియోగం పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 80 శాతం సబ్సిడీ ఇస్తున్నాయి. దీంతో రైతులు ఈ డ్రోన్ల కోసం ఎగబడుతున్నారు.

వ్యవసాయ యాంత్రీకరణలో డ్రోన్ల పాత్ర

రైతులు ఉద్యాన పంటలైన టమోటా, వంగ, పూలసాగు, కూరగాయలు, ఆకుకూరల సాగు నుంచి వరి, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలను చీడపీడల నుంచి కాపాడుకునేందుకు మందులు పిచికారీ చేస్తారు. దీంతో పాటు డ్రిప్ ద్వారా నీటిలో కలసిపోయే ఎరువులను మొక్కలకు అందిస్తారు. రైతులు వీపుకు పంపులు (మందులు పిచికారీ చేసే యంత్రాలు), డ్రిప్ పైపుల ద్వారా మొక్కలకు ఎరువులు కలిపిన నీటిని సాగు చేయడానికి ఎక్కువగా డబ్బులు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం గ్రాంట్లతో వ్యవసాయ డ్రోన్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఒక ఎకరాకు రైతులు మందులు పిచికారీ చేయాలంటే 3 నుంచి 4 గంటల సమయంతో పాటు ఎకరాకు రూ.600 నుంచి రూ.1000 వరకు ఖర్చు పెట్టాల్సి ఉంది. అదే డ్రోన్లతో మందులు పిచికారీ చేస్తే ఎకరా పొలానికి 10 నిమిషాల్లో మందులు పిచికారీ చేసేయొచ్చు. అంతే కాకుండా ఒక ఎకరాకు డ్రోన్‌తో మందుల పిచికారీ ఖర్చు కేవలం రూ.400 నుంచి రూ.600 వరకే ఉంటుంది. అలాగే పురుగుమందుల ఖర్చు కూడా 30 శాతం తగ్గుతుంది. నీటి వినియోగం కూడా తగ్గుతుంది. నీటిలో కలసిపోయే ఎరువులను కూడా డ్రోన్లతో పంటలకు పిచికారీ చేసే అవకాశం ఉండటంతో రైతుల సమయం ఆదాతో పాటు, ఖర్చు కూడా తగ్గుతుంది.

టమోటా సీజన్‌లో భలే గిరాకి

జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి నియోజకవర్గాల్లో మార్చి నెల నుంచి టమోటా సీజన్ నడుస్తుంది. సుమారు 30 వేల హెక్టర్ల వరకు రైతులు టమోటా పండించనున్నారు. ఈ క్రమంలో టమోటా పంటలకు పురుగుమందులు, ఎరువులు పిచికారీ చేసేందుకు ఈ డ్రోన్ల ఉపయోగం ఎక్కువగా ఉంటుంది. మండలానికి ఒక్కో డ్రోన్ మంజూరైనా నాలుగు నియోజకవర్గాల్లో 21 డ్రోన్లకు మంచి గిరాకీ ఉండనుంది.

టమోటా పంటకు గాలిలో నుంచే మందులు పిచికారీ చేస్తున్న డ్రోన్


80 శాతం సబ్సిడీ..వ్యవసాయ డ్రోన్లకు డిమాండ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌కేవీఎస్ పథకంలో పంపిణీ చేస్తున్న డ్రోన్ల కొనుగోలుకు రైతులకు 80 శాతం సబ్సిడీ అందిస్తున్నాయి. ఐదుగురు రైతులతో కూడిన ఒక గ్రూపును ఎంపిక చేసి ఆ గ్రూపులోని కన్వీనర్, కో-కన్వీనర్‌ల పేరుతో డీసీసీ బ్యాంకులో అకౌంటు తెరుస్తారు. వాస్తవంగా ఒక వ్యవసాయ డ్రోన్ ఖరీదు రూ.10 లక్షల వరకు ఉంటుంది. ఇందులో రైతుల గ్రూపు రూ.2 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈ డిపాజిట్ డబ్బులు కూడా డీసీసీ బ్యాంకు రుణం ఇస్తుంది. మిగిలిన రూ.8 లక్షల సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. జిల్లాలో ఒక్కో మండలం యూనిట్‌గా కేవలం 30 డ్రోన్లను మాత్రమే ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్నాయి. దీంతో ఈ వ్యవసాయ డ్రోన్లను పొందేందుకు రైతుల మధ్య డిమాండ్ పెరిగిపోతోంది.

గ్రామీణ యువతకు ఉపాధి

గ్రామాల్లో ఇంటర్ చదువుకున్న యువతీ, యువకులకు డ్రోన్ ఆపరేటింగ్ ద్వారా ఉపాధి అవకాశాలు వస్తాయి. వ్యవసాయ డ్రోన్ ఆపరేటింగ్ కోసం ఒక్కో మండలానికి ఒకరిని ఎంపిక చేస్తారు. వీరికి గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీలో 10 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఈ పదిరోజులు వీరికి ఉచిత భోజన, వసతి సౌకర్యాలు, ఇతర అలవెన్సులు కలిపి రూ.25 వేలు చెల్లిస్తారు. దీంతో పాటు డ్రోన్ ఆపరేటింగ్ లైసెన్సు కూడా మంజూరు చేస్తారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న పైలెట్‌లకు ఆయా మండలాల్లో రైతుల గ్రూపులకు మంజూరైన డ్రోన్ ఆపరేటింగ్ కోసం రెండేళ్ల అగ్రిమెంట్ చేసుకుంటారు. డ్రోన్ పొందిన రైతుల గ్రూపు ఆ మండలంలో డ్రోన్ అవసరమైన వారికి ఎకరాకు రూ.400 నుంచి రూ.600 చొప్పున అద్దె ప్రాతిపదికన అప్పగిస్తారు. ఒక్కో మండలంలో సీజన్‌ను బట్టి టమోటా, వంగ, మొక్కజొన్న, వేరుశనగ, వరి పంటలు సాగవుతాయి. ఈ క్రమంలో ఏడాది పొడవునా వ్యవసాయ డ్రోన్లతో మందులు, ఎరువుల పిచికారీ చేసే అవకాశాలు ఉంటాయి. దీంతో అటు రైతుల గ్రూపుకు, ఇటు పైలెట్‌కు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. శిక్షణ పొందిన పైలెట్లు పొలం చుట్టూ తిరిగి ఫీల్డ్‌మ్యాపింగ్ చేసి డ్రోన్ మానిటర్‌లో నమోదు చేస్తారు. దీంతో ఒక్కసారి పైకి ఎగిరిన డ్రోన్ ఖచ్చితత్వంతో పంటలకు, ప్రతి అడుగుకు, ప్రతి మొక్కకు మందులు, ఎరువులు పిచికారీ చేస్తాయి. పొలాల్లో అడ్డువచ్చే విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మలను గుర్తించి పక్కకు తొలగుతాయి. మరీ అడ్డు ఎక్కువగా ఉంటే తిరిగి పైలెట్ చెంతకు చేరిపోతాయి.

పండగకూ పప్పులేదు..!

- ఈనెలలోనూ మొండిచేయి
- మూన్నాళ్ల ముచ్చటేనా..?
- కార్డుదారులకు చక్కెరతోనే సరి



మదనపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు సబ్సిడీతో ఇస్తున్న కందిపప్పు సరఫరాకు బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో మూడునెలలు పంపిణీ చేసింది. అయితే ఫిబ్రవరి నెలకు సరఫరా ఆగిపోయింది. దీంతో నెలవారీ రెగ్యులర్‌గా ఇచ్చే బియ్యంతో పాటు చక్కెరతో సరిపెట్టుకుంది. ఇదే నెలలో శివరాత్రి పండగ ఉండటంతో కందిపప్పు ఇవ్వకపోవడం ఏంటని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఇప్పటికే ఉన్న స్టాకు గోదాము నిండుకోవడం, పైనుంచి స్టేజ్-1 పాయింట్‌కు స్టాకు రాకపోవడంతో ఇక్కడి అధికారులు కూడా చేతులెత్తేశారు. ఇప్పటికే ఆయా గోదాముల్లో ఉన్న స్టాకును అంగన్‌వాడీ, పాఠశాలలు, కళాశాలలు, సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లకు సర్దుబాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా చౌకధరల దుకాణంలో కందిపప్పు రూ.67కు అమ్ముతుండగా రూ.160కి పైగా ఉంది. దీంతో కార్డుదారులు కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు.

జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట డివిజన్‌లలోని 30 మండలాలు, మూడు మున్సిపాలిటీలు, బి.కొత్తకోట నగర పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 1,126 చౌకదుకాణాల పరిధిలో 4,98,092 రేషన్‌కార్డులు ఉన్నాయి. అయితే ప్రతినెలా కార్డులోని యూనిట్లతో సంబంధం లేకుండా కిలో కందిపప్పు, అరకిలో చక్కెర పంపిణీ చేస్తున్నారు. కానీ ఫిబ్రవరి నెలకు కూడా కార్డుకు కిలో చొప్పున 4,98,092 కేజీల కందిపప్పు అలాట్ చేయాల్సి ఉంది. కానీ గోదాముల్లో అందుబాటులో ఉన్న కందిపప్పును అంగన్‌వాడీలకు సరఫరా చేయగా, రెగ్యులర్ కార్డుదారులకు నిలిపేశారు. అయితే ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన నిత్యావసర వస్తువుల సరఫరా మంగళవారానికి బియ్యం, చక్కెరను ఎండీయూల ద్వారా 14,885 అంత్యోదయ కార్డులు, 1,54,429 తెల్లరేషన్ కార్డులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే రాష్ట్రవ్యాప్తంగా పౌర సరఫరాల శాఖకు కందిపప్పు సరఫరా చేసే కాంట్రాక్టర్ గడువు ముగిసిపోయినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో తిరిగి కందిపప్పు సరఫరాకు ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించగా, ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా కాంట్రాక్టర్ టెండర్ కోట్ చేయడంతో వాటిని రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం, కాంట్రాక్టర్ మధ్య ధర విషయంలో ఏకాభిప్రాయం కుదిరితే తప్ప కందిపప్పు వచ్చే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా కందిపప్పు సరఫరా లేకపోవడంతో ఎండీయూ వాహనదారులు బియ్యం, చక్కెర పంపిణీకి ముందున్నంత ఆసక్తి చూపడం లేదు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ

బస్సులో మరచిపోయిన రూ.1.50 లక్షల సొమ్ము ప్రయాణికుడికి అందజేత


చిన్నపరెడ్డికి డబ్బు అందజేస్తున్న డిపో మేనేజర్ రమణయ్య, కండక్టర్ మురళీధర్


రాజంపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ ఎస్.మురళీధర్ తన నిజాయితీని చాటుకున్నారు. బస్సులో ఓ ప్రయాణికుడు మరచిపోయి బస్సులో పెట్టి వెళ్లిపోయిన రూ.1.50 లక్షల సొమ్మును నిజాయితీగా తిరిగి ఆ ప్రయాణికుడికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో రాజంపేట నుంచి కడపకు వెళ్లే సర్వీసులో చిట్వేలికి చెందిన చిన్నపరెడ్డి అనే ఆటో డ్రైవర్ రూ.1.50 లక్షల సొమ్మును తీసుకెళ్లాడు. తాను పాత ఆటో అమ్మి వచ్చిన సొమ్ముతో కొత్త ఆటోను కొనేందుకు కడపకు ఆర్టీసీ బస్సులో వెళ్లాడు. బ్యాగులో పెట్టుకున్న ఆ నగదును పొరపాటున సీటుపై పెట్టి మరచిపోయి కిందకు దిగి వెళ్లిపోయాడు. ఇంతలో ప్రయాణికులందరూ దిగిపోయిన విషయాన్ని కండక్టర్ మురళీధర్ గమనిస్తుండగా ఓ సీటుపై బ్యాగు కనిపించింది. వెంటనే ఆ సొమ్మును తనవద్ద పెట్టుకుని వెనువెంటనే రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ రమణయ్యకు తెలియజేశారు. ఇంతలో కొత్త ఆటో కొనడానికి వెళ్లిన చిన్నపరెడ్డి షోరూం వద్దకు వెళ్లి డబ్బులు చూసుకోగా బస్సులో మరచిపోయిన విషయాన్ని తెలుసుకుని హుటాహుటిన తాను వచ్చిన బస్సు కోసం వెనుదిరిగాడు. కడపలోని ఇతర ఆర్టీసీ కండక్టర్ల ద్వారా రాజంపేట ఆర్టీసీ డిపోకు తాను పోగొట్టుకున్న సొమ్ము విషయాన్ని తెలియజేశారు. డిపో మేనేజర్ రమణయ్య చిన్నపరెడ్డిని రాజంపేటకు పిలిపించి తమ తోటి సిబ్బంది సమక్షంలో చిన్నపరెడ్డికి కండక్టర్ మురళీధర్ ద్వారా తన చేతులమీదుగా ఆ మొత్తాన్ని అందజేశారు. దీంతో కండక్టర్ మురళీధర్‌ను అందరూ అభినందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ కండక్టర్ మురళీధర్ నిజాయితీని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మురళీధర్‌ను అభినందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

- తుది దశకు చేరుకున్న ఉద్యాన క్రీడలు
- నేడు ముగియనున్న పోటీలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆవరణంలో జరుగుతున్న అంతర్ కళాశాలల రాష్ట్ర స్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు గురువారం అలరించాయి. అలాగే వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, పరుగు పందెం, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నీస్, హైజంప్ తదితర పోటీలు నిర్వహించారు. అన్ని క్రీడలు తుది దశకు చేరుకున్నాయి.


భరత నాట్యం చేస్తున్న విద్యార్థిని


ఉద్యాన విద్యార్థులు గీసిన చిత్రం


కబడ్డీ పోటీలో హోరాహోరీగా తలపడుతున్న అనంతరాజుపేట క్రీడాకారిణులు

శుక్రవారం క్రీడలు అన్నీ ఫైనల్స్ ఆడే ప్రక్రియను నిర్వాహకులు సిద్ధం చేశారు. ఉద్యాన విద్యార్థులు వివిధ రకాల పూలతో రంగవల్లులు వేశారు. అలాగే పాటలు, భరతనాట్యం తదితర వి ఆకట్టుకున్నాయి. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఉద్యాన యూనివర్శిటీ ఉపకులపతి కె.గోపాల్, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు పద్ధతి ప్రకారం నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూశామని తెలిపారు. కొన్ని క్రీడలు పూర్తి కావడంతో విద్యార్థులకు బహుమతులు అందజేశామని తెలిపారు. భోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడలేదన్నారు.

విజేతలు వీరే

బ్యాడ్మింటన్ పోటీల్లో అనంతరాజుపేట బాలుర, బాలికల జట్లు విజేతగా నిలిచింది. బాలుర వాలీబాల్, బాలికల త్రోబాల్ విజేతగా నిలిచాయి. బాలికల హైజంప్‌లో ఎస్. లక్ష్మీహారిక (సీఎస్‌పురం), ఎల్.అనూషా (వీఆర్‌గూడెం), ఏ.లక్ష్మీ (పార్వతీపురం) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

బాలుర డిస్కస్ త్రోలో రాహుల్ (వీఆర్‌గూడెం), శరత్‌చంద్ర (తాడిపత్రి), పృథ్వీ రాజ్ (పార్వతీపురం), మొదటి మూడు స్థానాల్లో సాధించారు. 400 మీటర్ల బాలుర పరుగుపందెంలో సిద్ధార్థ, అనిల్‌కుమార్, (వీఆర్ గూడెం) సాగర్ (అనంతరాజుపేట), బాలికల విభాగంలో యమున, అనూషా (వీఆర్‌గూడెం), ఎం.సమీర (అనంతరాజుపేట) మొదటి మూడు స్థానాలు సాధించారు.

ముగ్గురు కూలీల అరెస్ట్

- ఆయుధాల స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రఘురాం

చిట్వేలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో పరారీలో ఉన్న ముగ్గురు కూలీలను గురువారం ఉదయం 7.30 గంటలకు కేఎస్ అగ్రహారం పంచాయతీ రాపూరు క్రాస్‌రోడ్డు వద్ద అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు గొడ్డళ్లు, ఒక రంపం, 2 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రఘురాం తెలియజేశారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ, ఏఎస్పీ ఆదేశాల మేరకు సీఐ వెంకటేశ్వర్లు సూచనల మేరకు రాబడిన సమాచారంతో తాము సిబ్బందితో పోలీసు వాహనంలో వెళుతున్నామన్నారు. తమను చూసిన నిందితులు పారిపోతుండగా వెంబడించి పట్టుకుని విచారించామన్నారు. తాము రైల్వేకోడూరు మండలం కొత్తపల్లె ఎస్టీ కాలనీకి చెందిన మద్దూరు చెంచుక్రిష్ణ(30), వద్దొలకోటి(25), మద్దూరు రమణయ్య(28), ఎన్‌వీఎస్ గిరిజన కాలనీలకు చెందిన వారుగా గుర్తించి అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామని ఎస్ఐ రఘురాం తెలియజేశారు.

రేషన్‌షాపు ఆకస్మిక తనిఖీ


రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రామాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్లూరు పంచాయతీ పక్కీరుపల్లెలో 1137029 గల రేషన్‌షాపును గురువారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రేషన్ షాపులో ఉన్న బియ్యం, చక్కెర, కందిబేడలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే చౌకదుకాణ వస్తువులను రేషన్ లబ్ధిదారులకు అందించాలన్నారు. తూకాల్లో తక్కువ రాకుండా సక్రమంగా పంపిణీ చేసే విధంగా చూడాలని తహసీల్దార్‌కు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రామాంజనేయులు, లక్కిరెడ్డిపల్లె ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌కు చేరుకున్న షరీఫ్

బి.కొత్తకోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ సలహాదారు, మాజీ శాసనమండలి ఛైర్మన్ ఎంఏ షరీఫ్ గురువారం రాత్రి పొద్దుపోయాక బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ కు చేరుకున్నారు. ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్సియల్ పాఠశాలల పరిశీలన లో భాగంగా గురువారం కడప జిల్లాలో పర్యటించిన షరీఫ్ విడిది కోసం హార్సిలీహిల్స్ కు చేరుకున్నారు. ప్రొటోకాల్ మేరకు అధికారులు స్వాగతం పలికి, బస ఏర్పాట్లు చేశారు.

సింహవాహనంపై శ్రీనివాసుడి వైభవం

- బ్రహ్మోత్సవాల్లో వేడుకగా వాహన సేవల ఊరేగింపు
- నేడు కల్పవృక్ష, హనుమంత వాహన సేవలు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడోరోజైన గురువారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామి వారు ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి సింహవాహనంపై కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. వేదపండితులు గురువారం వేకువనే స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. వాహన సేవల ముందు కోలాటలు, చెక్కభజనలు, భజన బృందాల కోలాహలం, భక్తుల గోవిందనామస్మరణలతో సాంస్కృతిక శోభ కనిపించింది. వాహన సేవ అనంతరం స్వామి వారికి ఆలయ మండపంలో పాలు, పెరుగు, తేనే, కొబ్బరినీళ్లు, చందనంతో కనుల పండువగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి స్వామి వారికి సింహ వాహన సేవను వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రికి హనుమంత వాహన సేవలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, వేదపండితులు కృష్ణ ప్రసాద్ భట్టర్, రమేష్ స్వామి, సిబ్బంది నగేష్, టీడీపీ నాయకులు క్లస్టర్ ఇన్‌చార్జి బేరిశీన, సోము శేఖర్, ఆదిరెడ్డి, తరుగు శివారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


ముత్యపు పందిరివాహనంపై శ్రీవారు


సింహవాహనంపై విహరిస్తున్న శ్రీవారు

దాహార్తి తీరేదెప్పుడో..!

● బోర్లు వేశారు.. బిల్లులు చేసుకున్నారు ● బోర్లలో చుక్కనీరు పడని వైనం
● రూ.3 కోట్ల నిధులు నీళ్లపాలు ● మంచినీటి కోసం పల్లె ప్రజల ఇక్కట్లు


జె.వడ్డెపల్లెలో మంచినీటి కోసం బిందెల క్యూ

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత మూడేళ్లుగా తీవ్ర వర్షాభావం నెలకొనడంతో మంచి నీటి పథకం బోర్లు ఎండిపోయి నీటి ఎద్దడి నెలకొంది. దీంతో గత ఏడాది వైసీపీ ప్రభుత్వ హయంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.3కోట్లు జేజేఎం(జల్ జీవన్‌పథకం) పథకం కింద నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో ప్రతి గ్రామంలో 3, 4 మంచినీటి పథకం బోర్లు వేసి పైపులైను ద్వారా నీరు అందించినట్లు బిల్లులు మాత్రం చేసుకు న్నారు. అయితే ఏ గ్రామంలో చుక్కనీరు పడిన పాపాన పోలేదు. దీంతో చాలా గ్రామాల్లోని ప్రజలు మంచినీటి కోసం వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

మండలంలోని పందిళ్లపల్లె, జె.వడ్డెపల్లె, దిన్నెపాడు వడ్డెపల్లె, బి.యర్రగుడి, కోనంపేట వడ్డెపల్లె, అనంతపురం హరిజనవాడ గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఈ గ్రామాలలో జేజేఎం నిధులతో 29 బోర్లు వేసినట్లు రూ.3 కోట్ల బిల్లులు చేసుకున్నారు. అయితే ఒక్క బోరులో కూడా చుక్క నీరు పడలేదని ప్రజలు చెబుతున్నారు. దీంతో ఇప్పటికీ పందిళ్లపల్లె జె.వడ్డెపల్లెలో తాగునీటి సమస్య తీరలేదు. గ్రామంలో సుమారు 130 కుటుంబాలు ఉన్నాయి. పాడి పశువులు, సూమారు 5వేలకు పైగా జీవాలు ఉన్నాయి. ఇక్కడ సుమారు 10 మంచినీటి బోర్లు వేశారు. ఏ బోరులో కూడా చుక్కనీరు పడ లేదు. దీంతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. తాగునీటి కోసం దూరప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తాగునీటి శాశ్వత పరిష్కారం కోసం వెలుగల్లు ప్రాజెక్టు నుంచి కుడికాలువ ద్వారా నీరు అందించాలని మొర పెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. వెలుగల్లు ప్రాజెక్టు నీరు అందిస్తే పందిళ్లపల్లె, కుర్నూతల, కస్తూరి రాజుగారిపల్లె, మద్దిరేవుల, కోనంపేట,


బీసీ నాగిరెడ్డిపల్లెలో వ్యవసాయబోరు నుంచి నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు


బి.ఎర్రగుడి, దిన్నెపాడు గ్రామాలలో బోర్లు నిండుకుండలా ఉంటాయని.. తాగునీరు సమస్య తీరుతుందని చెబుతున్నారు. ఆ దిశగా శాశ్వత పరిష్కారం చూపుతు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బోర్ల వద్ద కాపలా ఉండి..



ఊరునిండా 10 బోర్లు వేశారు. ఒక్క బోరులో కూడా చుక్కనీరు పడలేదు. ఉన్న ఒక్క బోరులో వచ్చే చుక్కచుక్క నీటిని ఉదయం నుంచి సాయంత్రం వరకు కాపలా ఉండి తెచ్చుకుంటు న్నాం. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా సక్రమంగా చేయడం లేదు. ఒక బజారుకే వదిలి వెళ్లిపోతున్నారు. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది.

-వెంకటసుబ్బమ్మ, జె.వడ్డెపల్లె

పాచి నీళ్లు వస్తున్నాయి



మంచినీటి పథకం బోరు నుంచి పాచి నీళ్లు పచ్చగా వస్తున్నాయి. ఆ నీరు తాగడానికి సరిగా లేవు. వ్యవసాయ బోరు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుం టాన్నాం. బోరును రీబోరు చేయించాలి. అధికారులు చర్యలు చేపట్టి రానున్న వేసవికాలంలో అయినా మంచినీరు అందించాలి.

-రమణమ్మ, జే.వడ్డెపల్లె

గుండెపోటుకు ఉచిత వైద్యం

● ప్రభుత్వ ఆస్పత్రుల్లో టెనెక్టెప్లెస్ ఇంజక్షన్


గుండెకు భరోసాపై అవగాహన పోస్టర్ విడుదల చేస్తున్న వైద్యాధికారులు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్టెమీ అనే గుండెపోటు వ్యాధికి రూ.45వేలు విలువైన టెనెక్టెప్లెస్ ఇంజక్షన్‌ను ఉచితంగా ఇచ్చి ప్రాణాలను కాపాడవచ్చని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు తెలిపారు. గురువారం జిల్లా ఆస్పత్రిలో గుండెపోటుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఛాతి నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం లాంటి లక్షణాలన్నీ గుండె పోటుకు సంబంధించినవన్నారు. ఇలాంటి లక్షణాలు గమనించి మొదటి గంట అత్యంత కీలకమన్నారు. ఈలోపు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రికి గానీ తీసుకు వస్తే టెనెక్టెప్లెస్ ఇంక్షన్‌తో ప్రాణాలు కాపాడతారన్నారు. ఈ ఇంజెక్షన్ ప్రైవేటు ఆసుత్రుల్లో రూ.45 వేలు అవుతుందని అలాంటిది ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎన్‌టీఆర్‌వైద్య సేవల కింద బైసాస్‌సర్జరీ ఉచితంగా చేస్తారన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు ఎన్‌ఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రేపటి నుంచి కర్నూలులో విరసం రాష్ట్ర సాహిత్య పాఠశాల

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విప్లవ రచయితల సంఘం 25వ రాష్ట్ర సాహిత్య పాఠశాల ఈ నెల 8,9 తేదీలలో కర్నూలులోని వెంకటాద్రినగర్ వెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.వరలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక సృజనా సామాజిక వేదిక కార్యాలయంలో విరసం రాష్ట్ర సాహిత్య పాఠశాల కరపత్రాలను ప్రముఖ కథా రచయిత దాదాహయాత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ 1970లో ఆవిర్భవించిన విప్లవ రచయిత సంఘం ఎన్నో నిర్బంధాలను నిషేధాలను తట్టుకుని కవులు, రచయితలు ప్రజా పక్షం వుండాలనే ఒక ప్రజాస్వామిక సాంప్రదాయాన్ని నిలబెట్టిందన్నారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సంక్షోభకాలంలో సాహిత్యకారుల పాత్రను చర్చించాల్సిన అవసరం వుందన్నారు. ప్రజల పక్షాన సాహిత్యకారులను నిలబెట్టాల్సిన సందర్భం అన్నారు. ఈ రెండు రోజులు సాహిత్య పాఠశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రచయితలు, కవులు, కళాకారులతో పాటు ఉద్యమ అభిమానులు, ప్రజాస్వామిక వాదులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తవ్వాసురేష్, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు లెక్చరర్ సురేష్ బాబు, సృజనా సామాజిక వేదిక కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సుద్దపల్లె మురళి, రాయలసీమ విద్యావంతుల వేదిక సభ్యుడు సుబ్బయ్య ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

దయగల తల్లి మరియతల్లి


మాట్లాడుతున్న ఫాదర్ వరప్రసాద్

కడప కల్చరల్ ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి) : విశ్వాసుల పట్ల దయగల తల్లి మరియ తల్లి అని కడప పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఎం.వరప్రసాద్ కొనియాడారు. మరియాపురం లూర్ధుమాత తిరుణాల మహోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి పాత చర్చి ఆవరణంలో జరిగిన నవ దిన పూజా ప్రార్థనల్లో విశ్వాసులు భక్తిభావంతో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన విశ్వాసుల నుద్దేశించి దైవ సందేశం ఇచ్చారు. పాపులను రక్షించేందుకే మరియతల్లికి యేసుప్రభువు మానవునిగా జన్మించారన్నారు. అంతకు ముందు విచారణ గురువు ఫాదర్ సిప్రియన్ దివ్యబలిపూజ గావించారు. తిరుణాల కమిటీ ప్రతినిధులు జ్యోతిరాయప్ప, బాలశౌరి, ప్రదీప్, ఆనంద్, ప్రసాద్‌తో పాటు విశ్వాసులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

విశాఖపట్నం (ఎంవీపీ కాలనీ), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అప్పుఘర్ సమీపంలోని శ్రీకృష్ణ పీజీ బాయ్స్ హాస్టల్‌లో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కడప జిల్లా బద్వేల్ మండలంలోని వెంకటశెట్టి పల్లి సమీపంలోని రాజుపాలానికి చెందిన వెలిగండ్ల కార్తీక్ రాజు (22) విజయనగరంలోని ఏవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. అనంతరం ఓ కంపెనీలో కోర్సు చేసి ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. కొద్ది రోజుల తర్వాత ఉద్యోగంలో జాయిన్ కావాలంటూ ఫోన్ కాల్ రావడంతో మైక్రోగ్రిడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో గత నెల 31న చేరాడు. అప్పటి నుంచి నగరంలోని శ్రీకృష్ణ పీజీ బాయ్స్‌లో ఉంటున్నాడు. అయితే బుధవారం ఉదయం నుంచి హాస్టల్ గది నుంచి బయటకు రాలేదు. అనుమానం వచ్చిన హాస్టల్ నిర్వాహకులు అతడు ఉంటున్న గది తలుపులు తెరచి చూడగా ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. దీంతో వసతిగృహం నిర్వాహకులు ఎంవీపీ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా చక్రస్నానం... తరించిన భక్తజనం

● హంస వాహనంపై విహరించిన వీణాధరుడు ● ధ్వజావరోహణంతో ముగిసిన దేవుని కడప బ్రహ్మోత్సవాలు


పుష్కరిణిలో చక్రస్నానం ఆచరిస్తున్న దృశ్యం

కడప కల్చరల్ ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ధ్వజావరోహణంతో వైభవంగా ముగిశాయి. బ్రహోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి 8 గంటలకు శ్రీలక్ష్మీవేకంటేశ్వరుడు వీణాధరుని అలంకారంలో హంస వాహనంపై మాడవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఊరేగింపు ముందు భాగాన చెక్కభజన, కోలాటం కళాకారులు లయబద్ధమైన నృత్యాలు భక్తులను అలరింపచేశారు. అంతకు ముందు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు వసంతోత్సవం ఆనందకర వాతావరణంలో చేసు కున్నారు. 9 నుంచి 10-30 వరకు తిరుమలేసుడి చక్రత్తాళ్వార్‌ను ఆలయ అర్చకులు క్రిష్ణమోహన్, త్రివిక్రమ్, క్రిష్ణమూర్తి, తరణ్, సాయిలు ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ సమీప పుష్కరిణిలో ఉత్సవమూర్తుల విగ్రహాలకు గందాధి లేపనాలతో అవభృత చక్రస్నానం నిర్వహించారు. సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించారు. చక్రస్నానానికి భక్తులు విశేషంగా హాజరై పుష్కరిణిలో అత్యంత భక్తిశ్రద్ధలతో స్నానమాచరించారు. ఉత్సవాల ముగింపులో భాగంగా రాత్రి ధ్వజావరోహణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ ఇరువురికి గాయాలు

సికెదిన్నె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ కుప్పాల జనార్ధన్, బైక్‌పై ఉన్న బత్తల సుబ్బయ్య అనే వ్యక్తులకు గాయాలు అయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు గురువారం ఉదయం కడప-రాయచోటి జాతీయ రహదారిలోని జమాల్‌పల్లి వద్ద ట్రాక్టర్ ఆగి ఉండగా పక్కనే బైక్‌పై మరో వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌తో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో కడప నుంచి రాయచోటి వైపు వెళుతున్న సిమెంటు లారీ ట్రాక్టర్‌ను వెనుక వైపు ఢీకొంది. దీంతో ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో డ్రైవర్ జనార్ధన్‌తో పాటు బైక్‌పై ఉన్న బట్టల సుబ్బయ్యకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

కారు ద్విచక్రవాహనం ఢీకొని...

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని శీలంవారిపల్లె వద్ద గురువారం సాయంత్రం కారు, ద్విచక్రవాహనం ఢీ కొనడంతో పెంచలయ్య (చిన్న) అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పెంచలయ్య బద్వేలు పట్టణంలో పెయింట్ పనికి వెళ్లి తిరిగి లక్ష్మీపాలెంలోని తన ఇంటికి ద్విచక్రవాహనంలో వస్తున్నాడు. ఆ సమయంలో రహదారిపై గేదెలు అడ్డంగా రావటంతో ఎదురుగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో పెంచలయ్యకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108వాహనం ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ట్రిపుల్‌ఐటీ అధ్యాపకుల ప్రయోగానికి రూ.34లక్షలు మంజూరు

● ముగ్గురు అధ్యాపకుల ఎంపిక




అధ్యాపకులు అమరేంద్రకుమార్, మహబూబ్ జిలానీ, రమేష్

వేంపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌లో కొత్త పరిశోధనల కోసం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులకు మూడు ప్రాజెక్టులు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రీయ ఉచిత శిక్షణ అభియాన్ ద్వారా మూడు కొత్త ప్రాజెక్టుల పరిశోధనల కోసం రూ.34లక్షలు ప్రభుత్వం విడుదల చేసినట్లు ఇ డుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ప్రొఫెసర్ అమరేంద్రకుమార్, మహబూబ్ జిలాని, జి.రమేష్‌లు ఈ ప్రాజెక్టులకు ఎంపిక య్యారన్నారు. అధ్యాపకులు చేసే క్రొత్త పరిశోధనల వల్ల ఇంజనీరింగ్ విద్యార్థులకు, పరిశ్రమలకు మంచి ఫలితాలు లభిస్తాయని డైరెక్టర్ ఆకాంక్షించారు.

వైవీయూ అకడమిక్ అఫైర్స్ డీన్‌గా ప్రొఫెసర్ చంద్ర ఓబుల్‌రెడ్డి


నియామకపత్రం అందిస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వైవీ యూనివర్సిటీ డీన్‌గా విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర ఆచార్యులు పి.చంద్ర ఓబుల్‌రెడ్డిని నియమించారు. గురువారం విశ్వవిద్యాలయంలోని వీసీ చాంబర్‌లో ఆచార్య చంద్రఓబుల్‌రెడ్డికి ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి కులసచివులు మరియు ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డితో కలిసి నియామకపు పత్రాన్ని అందించారు. ఇది వరకు ఈ స్థానంలో పనిచేసిన కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ ఏజీ దాము పదవీకాల పూర్తికావడంతో ఈ నూతన నియామకం చేపట్టారు. కార్యక్రమంలో ఆచార్య టి.చంద్రశేఖర్ పాల్గొన్నారని ప్రజాసంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి.సరిత పేర్కొన్నారు.

వెలుగు యానిమేటర్ల చేతివాటం

● రూ.కోట్లలో గ్రూపు సభ్యులకు టోకరా
● చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం
● ఏడాదిగా లభించని యానిమేటర్ మల్లిక ఆచూకీ



ముద్దనూరు ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెలుగు యానిమేటర్లు చేతివాటం ప్రదర్శిస్తూనే ఉన్నారు. మూడు సంవత్సరాల నుంచి యానిమేటర్లు గ్రూపు సభ్యులకు వేస్తున్న టోకరాలు ఒకొక్కటిగా ఆధారాలతో బయటపడుతున్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో యానిమేటర్ల దోపిడీకి అడ్డూ అదుపులేకుండా పోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే...

మండలంలో వెలుగు సంఘం గ్రూపులు దాదాపు 730 ఉండగా.. సభ్యులు దాదాపు 7982 మంది ఉన్నారు. 32 మంది యానిమేటర్లు ఉన్నారు. వీరిలో కొంత మంది యానిమేటర్లు గ్రూపు సభ్యులను మోసం చేస్తున్నారు. గతంలో ఉప్పలూరు గ్రామంలో ఇద్దరు (భార్యా భర్త) యానిమేటర్లు చేతివాటం ప్రదర్శించారు. శ్రీనిధి గ్రూపు సభ్యుల నుంచి దాదాపు రూ.60లక్షల దాకా టోకరా వేశారు. అయితే ఇద్దరు మృతి చెందడంతో ఈ వ్యవహారం అంతా భయటపడింది. అలాగే యామవరం గ్రామంలోని మరో యానిమేటర్ శ్రీనిధి గ్రూపు సభ్యులకు దాదాపు రూ.30లక్షలకు టోకరా వేశారు. అయితే ఏపీఎంపై ఆరోపణలు రావడంతో వారిని సస్పెండ్ చేశారు. యామవరం యానిమేటర్‌పై కేసు నమోదు చేసి సరిపెట్టుకున్నారు తప్ప డబ్బులు రికవరీ చేయలేకపోయారు. ముద్దనూరు టౌన్‌లోని మరో యానిమేటర్ మల్లిక దాదాపు రూ.50లక్షలు వీవో, గ్రూపు సభ్యుల నుంచి వసూళ్లు చేసి టోకరా వేసి పరారై ఏడాది కావస్తోంది. అయితే ఆ యానిమేటర్‌పై కనీసం కేసు కూడా పెట్టలేదు. వీవో డబ్బులు తమకు ఎటువంటి సంబంధం లేదన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. గతంలో యానిమేటర్లు టోకరా వేయడంతో జిల్లా అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకొని కేసులు నమోదు చేశారు. ఇప్పటికీ యానిమేటర్ మల్లికా ఆచూకీ లేకపోవడంతో విధుల నుంచి తొలగించి ఆ యానిమేటర్ స్థానంలో మరొకరిని పెట్టుకొన్నట్లు తెలిసింది. కాగా, యానిమేటర్ కుటుంబ సభ్యులు ముద్దనూరులో ఉన్నారు. యానిమేటర్ ఆచూకీ లేదు, ఉద్యోగానికి రాజీనామా చేయలేదని, ఆయానిమేటర్‌ను ఏవిధంగా తొలగించి ఆమె స్థానంలో మరొకరికి ఉద్యోగం ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. గతంలో చేతివాటం ప్రదర్శించిన యానిమేటర్లపై నామమాత్రపు చర్యలు తీసుకోవడంతో అదే బాటలో మరికొందరు యానిమేటర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం



గతంలోనే అప్పటి ఇన్‌చార్జి ఏపీఎం ఇబ్రహీం పోలీస్‌స్టేషన్‌లో యానిమేటర్ మల్లికపై ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు కేసు నమోదు చేయలేదు. తిరిగి రెండు రోజుల క్రితం వీవోకు సంబంధించి డబ్బులు యానిమేటర్ మల్లిక వాడుకున్నారని వీవో అధ్యక్షురాలు, సీసీలు వెళ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే పీడీ వద్ద లెటర్ తీసుకురావాలని పోలీసులు తెలిపారు. అందుకే పీడీకి లెటర్ పెడుతున్నాం.యానిమేటర్ మల్లిక స్థానంలో మరొకరిని చేర్చుకోవడం జరిగింది. మండలంలో ఇద్దరు యానిమేటర్లకు 60 ఏళ్లు పైబడటంతో వారి స్థానంలో కూడా వేరేవారిని సమావేశంలో తీర్మానం చేసి చేర్చుకున్నాం.

-అప్పర్ణదేవి, ఏపీఎం,ముద్దనూరు

మైనార్టీ సంక్షేమానికి టీడీపీ కృషి

● ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్


సమావేశంలో మాట్లాడుతున్న షరీఫ్

వేంపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీ సంక్షేమానికి ముఖ్యంగా మైనార్టీల విద్యాభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ తెలిపారు. వేంపల్లెలోని మైఆనర్టీ గురుకుల పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. అధ్యాపకులతో, విద్యార్థులతో సమావేశమయ్యారు. గురుకుల పాఠశాల నిర్వహణ, వసతుల గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి షరీఫ్ మాట్లాడుతూ విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.అనంతరం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ మొదటి నుంచి ముస్లిం మైనార్టీలకు అండగా నిలించిందని గుర్తుచేశారు. మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, టీడీపీ మైనార్టీ కన్వీనర్ వలి, గ్రంథాలయ మాజీచైర్మన్ బాలస్వామిరెడ్డి, మైనార్టీ నాయకులు ఫయాజ్, మహబూబ్ షరీఫ్, డాక్టర్ కరిముల్లా, పీరా, ప్రిన్సిపల్ సుగుణమ్మ పాల్గొన్నారు.

'కొండపేట ఉర్దూ పాఠశాలను చెన్నూరుకు మార్చవద్దు'


ఎంఈవో కార్యాలయానికి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు

చెన్నూరు. ఫిబ్రవరి 6 (ఆంధ్ర జ్యోతి):కొండపేట ఉర్దూ పాఠశాలను చెన్నూరు హైస్కూలులోకి మార్చవద్దు అని విద్యార్థుల తల్లిదండ్రులు తెలి పారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో సునీతకు వినతిపత్రం అందించారు. ప్రస్తుతం కొండపేట ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలలో 6, 7 8 తరగతులకు సంబంధించి 30 మంది ఉన్నారన్నారు. వారిని చెన్నూరు హైస్కూలుకు మారిస్తే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొండపేట ప్రాథమికోన్నత పాఠశాల నుంచి చెన్నూరు ఉన్నత పాఠశాలకు కిలోమీటరు పైగా దూరం ఉంటుందన్నారు. ఎంఈవోను కలిసిన వారిలో విద్యార్థుల తల్లిదండ్రులు షరీఫ్, షబ్బీర్‌హుసేన్, మాజీ సర్పంచ్ ఖాసింపీరా, మహ్మద్, మాజీ సర్పంచ్ బాషు, మహ్మద్ బాసా, చాంద్‌పీరా, చాంద్‌బాషాతో పాటు పలువురు ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి: కమిషనర్

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధి నందు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు మార్చి 1వతేదీ నుండి నిషేధిస్తున్నామని పట్టణ ప్రజలు, వ్యాపార వర్గాలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు వ్యాపార సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం నగర పంచాయతీలో ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వారితో తెలిపారు. వ్యాపార సంస్థల యజమానులు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జ్యూట్‌బ్యాగులు, పేపరు కవర్లు, పేపరు గ్లాసులు వినియోగించుకోవాలని ప్లాస్టిక్ నిషేధాన్ని మార్చి 1వతేదీ నుండి సంపూర్ణంగా అమలు చేసస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి షాపు ముందు ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించిన నోటీసు బోర్డు ఉంచాలని ఆయన తెలిపారు.

ఇమామ్, మౌజన్‌లకు జీతాలు చెల్లించాలి

కడప సెవెన్ రోడ్స్ ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇమామ్, మౌజనులకు జీతాలను వెంటనే చెల్లించాలని ఆప్‌కి ఆవాజ్ జిల్లా కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. గురువారం ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాషా తెలిపారు. కడప జిల్లా కమిటీలను ఎన్నుకున్నామని, జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ షాజహాన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ చాన్‌బాషా, జిల్లా ఉపాధ్యక్షుడిగా గౌసియా, షఫీ, ఆజాం బాషా, జిల్లా కార్యదర్శిగా సయ్యద్ మహబూబ్ సాహెబ్, రిజ్వానా, నూర్ బాషా, ఇమ్రాన్, అబ్దుల్, సాదిక్‌తో పాటు 17 మందిని ఎన్నుకున్నామన్నారు.

లైబ్రరీలో మరిన్ని మెరుగైన సేవలు

● వైవీయూ అడ్వైజరీ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వైవీయు లైబ్రరీలో విద్యార్థులకు మరింత మెరుగైన సేవలు కల్పించాలని లైబ్రరీ అడ్వైజరీ కమిటీ కన్వీనర్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. బుధవారం వైవీయూ ఏపీజే అబ్దుల్ కలాం సెంట్రల్ లైబ్రరీలో అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. పాఠ్యపుస్తకాలు కొనుగోలు, జర్నల్స్ ఈ జర్నల్స్, డిజిటల్ లైబ్రరీ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే వనరులు వినియోగంపై కూడా చర్చించారు. డీన్‌లు ప్రొఫెసర్ ఏజీ దాము, ప్రొఫెసర్ కె.గంగయ్య, ప్రొఫెసర్ రమాదేవి లైబ్రరీ అసిస్టెంట్లు డాక్టర్ బి.ప్రసాద్‌రావు, ఆర్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కడప నగరంలో ఆక్రమణల తొలగింపు


నాగరాజుపేటలో ఆక్రమణలను తొలగిస్తున్న సిటీ ప్లానింగ్ సిబ్బంది

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కడపలోని నాగరాజుపేట, మారుతీనగర్, అశోక్‌నగర్ ప్రాంతాలలో గురువారం మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి పరిశీలించారు. నాగరాజుపేటలో ఇంక్లూజిమెంట్స్ సత్రం తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ నాగరాజుపేట, నారాయణ కళాశాల నుంచి పాత బస్టాండ్, అంబేడ్కర్ సర్కిల్ వరకు ఆక్రమణలను తొలగించాలన్నారు. అలాగే చిరు వ్యాపారులు వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

● క్రమశిక్షణ, లక్ష్య సాధన, పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదగాలి ● మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఈదురుబాషా


మాట్లాడుతున్న సీఐ ఈదురు బాషా

కడప క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మహిళా పీఎస్ సీఐ జి.ఈదురు బాషా అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగేలా పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇందులో భాగంగా గురువారం నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలన్నారు. బాగా చదువుకుని సమాజానికి, దేశానికి సేవ చేయాలని సీఐ సూచించారు. తల్లిదండ్రుల ఆశలను, ఆశయాలను నెరవేర్చేలా మీ వంతు కృషి చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. అవగాహన కార్యక్రమంలో ఫోక్సో యాక్టు పిల్లల భద్రత, బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, డయల్ 100, రహదారి భద్రత, సోషల్ మీడియా అండ్ సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళా పీఎస్ సీఐ ఈదురు బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పీఎస్ ఎస్ఐ శ్రీనివాసులు, వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్స్ జి.మహేశ్, సునిత, హెడ్‌కానిస్టేబులు వై.సహదేవ్‌రెడ్డి, మహిళా కానిస్టేబుల్ సి.అపర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు అండగా టీడీపీ ప్రభుత్వం

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజలకు అండగా టీడీపీ ప్రభుత్వం ఉంటుందని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి తెలిపారు. గురువారం ద్వారకనగర్ ఆమె కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. కడప నియోజకవర్గం పరిధిలో ప్రజలు హాజరై వారి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆమె సత్వరం స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు.

కేంద్ర కార్యాలయంలో...

విజయవాడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన ప్రజా ఫిర్యాదుల కార్యాలయంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

జాతీయ విద్యావిధానం భవిష్యత్ తరాలకు మార్గదర్శకం



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మణ్

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానం భవిష్యత్ తరాలకు మార్గదర్శకమని జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంత లక్ష్మణ్ తెలిపారు. గురువారం డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో జాతీయ విద్యావిధానం భారత జాతి వారసత్వం, సాహిత్య పునరుద్ధరణ అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా గుంతా లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ భారతావనికి జాతీయ విద్యా విధానం ఎలా దోహదం చేస్తుందనే అంశం వివరించారు. అనంతరం వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.విశ్వనాథ్‌కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో భాగస్వామ్యం ఏర్పరచుకోవడం విద్యార్థులకు శుభపరిణామమన్నారు. ప్రముఖ తెలుగు అధ్యాపకుడు ఆచార్య ఈశ్వరరెడ్డి ప్రసంగిస్తూ మాతృభాషలో విద్యాబోధన ఆవశ్యకతను తెలియజేశారు. ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు మహాకవయిత్రి మొల్ల సాహిత్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఎస్.రాజేష్ కుమార్‌రెడ్డి, వేంకటేశ్వర విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఆచార్య వై.వి.రామిరెడ్డి, జేఎన్టీయూ అనంతపురం అధ్యాపకులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసు నమోదు: సీఐ

చెన్నూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మైనర్లు వాహనాలు నడిపితే వారితో పాటు వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని సీఐ పురుషోత్తం రాజు అన్నారు. మండలంలోని అలంఖాన్‌పల్లె ఇస్కాన్ సర్కిల్ పరిధిలో గురువారం సాయంత్రం ర్యాష్ డ్రైవింగ్ చేసే మైనర్లు, యువతకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారితో మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన తరువాత డ్రైవింగ్ లైసెన్సు పొందాలన్నారు. అలాగే మట్కా, గంజాయి, గ్యాంబ్లింగ్, ఇసుక అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్. గ్రామల్లో గొడవలు, దొంగతనాలపై చర్యలు కఠినంగా ఉంటాయన్నారు.

పులివెందుల అభివృద్ధికి సహకరించండి: బీటెక్ రవి


హోం శాఖా మంత్రి అనితతో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ రవీంద్ర నాథరెడ్డి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, హోంమంత్రి వంగలపూడి అనితను కోరారు. గురువారం అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో జలవనరుల శాఖ మంత్రికి నియోజకవర్గంలోని పెండింగులో ఉన్న కాల్వలు, ప్రాజెక్టు పనుల గురించి వివరించారు. అలాగే హోం శాఖమంత్రి అనితను కలిసి నియోజకవర్గంలోని సమస్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, వేంపల్లె మండలం టీడీపీ పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాదరెడ్డి, పులివెందుల మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరు వెంకట్రామిరెడ్డి, వేంపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు మునిరెడ్డి పాల్గొన్నారు.

9 గంటల విద్యుత్ ఇవ్వాలి

వేంపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు 9గంటల విద్యుత్ ఇవ్వాలని వైసీపీ జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురువారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్ 7గంటలు మాత్రమే చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారన్నారు. ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో రైతులకు 9గంటలు ఉచిత విద్యుత్ కంటిన్యూ చేస్తామని, ఎన్నికల్లో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ఇపుడు ఏడు గంటలు మాత్రమే చేస్తామని చెప్పడం దారుణమన్నారు.

కడపలో యాదవ భవన్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని యాదవుల అభివృద్ధి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కడపలో యాదవ భవన్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని రాయలసీమ యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నారాయణయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుట్లంపల్లె పంచాయతీ పరిధిలోని రిమ్స్ సమీపంలో గత సర్వేనెం.154/1, 155/1, 5,6,7 విస్తీర్ణంలో 83 సెంట్ల స్థలాన్ని అప్పటి తహసీల్దారు కేటాయించి ఆ మేరకు కలెక్టరుకు రిపోర్టు కూడా పంపించారని గుర్తు చేశారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాములేటి యాదవ్, నాయకులు రామమూర్తియాదవ్, బాబుయాదవ్, ఎల్లయ్యయాదవ్, గోపాలయాదవ్, శివశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్సీ

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సత్యానంద బాబుపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ (గుంటూరు) ఉన్నతాధికారికి ఎమ్మెల్సీ రామగోపాలరెడ్డి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈ-మెయిల్ ద్వారా లేఖ పంపారు. సత్యానంద బాబు ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారన్నారు. లంచం డిమాండ్ చేస్తూ పెన్షనర్లు, ఉద్యోగులను ముప్పుతిప్పలు పెడుతున్నాడన్నారు. తను అడిగినంత లంచం ఇవ్వకుంటే నెలల తరబడి బిల్లులు పెండింగ్ పెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. కారణాలు లేకుండా బిల్లులకు కొర్రులు వేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పేర్కొన్నారు.

కార్పొరేషన్ అధికారుల అత్యుత్సాహం


అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సురేశ్‌బాబు

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నగర కార్పొరేషన్ అధికారుల ధ్యేయమంతా ఎస్సీలకు చెందిన ఆస్తులను కూల్చడమే పనిగా పెట్టుకున్నారా అంటూ 26వ డివిజన్ వైసీపీ నేతలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కడప నగరంలోని వైసీపీ కార్పొరేటర్ నాగమణి భర్త త్యాగరాజు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తుల మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చేందుకు వచ్చిన కార్పొరేషన్ అధికారులను అడ్డుకున్నారు. మాకు అన్ని రకాల అనుమతులు, పట్టాలు ఉన్నాయని కోర్టులో విచారణ కూడా ఉందని వాపోయారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండాఎలా కూల్చడానికి వస్తారని నిలదీయడంతో వారు వెనుదిరిగి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ సురేష్‌బాబు, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మన్ పులి సునీల్‌కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాజీమెంబర్ పాక సురేష్, కిరణ్, శివకోటిరెడ్డి, మల్లికార్జున, కె.బాబు, షఫీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె పాపాఘ్నిలో ఇసుక రీచ్ వద్దు

● దూరంగా పెట్టండి ● ప్రజాభిప్రాయ సేకరణలో నాయకులు



వేంపల్లెలో ఇసుక రీచ్‌ల ఏర్పాటుపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆర్డీఓ, అధికారులు

వేంపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెకు సమీపంలో పాపాఘ్ని నదిలో చుట్టుపక్కల గ్రామాలకు, వేంపల్లె పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే నీటి పథకాలు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో ఇసుక రీచ్ వద్దని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, బీజేపీ జిల్లా కార్యదర్శి గాలి హరిప్రసాద్, టీడీపీ యువనాయకులు నామావేమకుమార్‌లు అధికారులకు విజ్ఞప్తిచేశారు. అవసరమైతే వేంపల్లె పట్టణానికి దూరంగా ఏర్పాటుచేసుకోవాలని వారు అధికారులకు తెలియజెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య పర్యవేక్షణలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. ప్రస్తుతం వేంపల్లె ప్రాంతం నుంచి ట్రాక్టర్లు, ఇసుక బండ్లతో సచివాలయ అనుమతులు తీసుకొని స్థానికంగా ఉపయోగించుకునే విధానమే బాగుందని పలువురు అధికారులకు తెలిపారు. గతంలో కుమ్మరాంపల్లె, కప్పలమడుగు సమీప ప్రాంతంలో ఇసుక రీచ్ ఉండేదని, అక్కడ ఏర్పాటుచేస్తే తాగునీటి సమస్యకు ఇబ్బంది ఉండదన్నారు. ఇసుక రీచ్ ఏర్పాటుచేస్తే గతంలో పెద్దఎత్తున ఇసుక తరలిపోయిందని, ఇదే పరిస్థితి మళ్లీ కొనసాగితే భవిష్యత్ తరాలకు ఇసుక ఉండదన్న అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయం, ఇసుక అవసరాల కోసం ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకుంటుందని ఆర్డీఓ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, భూగర్భ గనుల శాఖ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అదికారులు పాల్గొన్నారు.

కీటకాలను నిర్మూలించి దిగుబడి పెంచడమే లక్ష్యం


డాక్టర్ కొర్రపాటి సునీల్‌కుమార్, కీటక విభాగం శాస్త్రవేత్త

ఫటాఫట్

సికెదిన్నె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పంటలను ఆశించే కీటకాలను నిర్మూలించి పంట దిగుబడి పెంచి రైతుల ముఖంలో ఆనందం నింపడమే తన ప్రధాన లక్ష్యమని ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయం పరిశోధన స్థానం కడప కీటక విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కొర్రపాటి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఫటాఫట్ ఇంటర్వ్యూలో ఆ వివరాలు వెల్లడించారు.

ప్రశ్న: కీటక విభాగం శాస్త్రవేత్తగా మీ బాధ్యత ఏమిటి

జవాబు: రైతులు సాగు చేసిన పైర్లకు ఆశించే కీటకాలను గుర్తించి వాటిని నిర్మూలించడం.. పంట దిగుబడి పెంచడం.. దీనిపై రైతులకు అవగాహన కల్పించడం.. తద్వారా రైతులకు పంట పెట్టుబడి తగ్గించి ఆదాయం పెంచడమే మా బాధ్యత.

ప్రశ్న: ఏయే పంటల్లో పరిశోధనలు చేస్తున్నారు.

జవాబు: వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రధానంగా వరి, వేరుశనగ, నువ్వులు పంటల్లో పరిశోధనలు చేస్తున్నాం.

ప్రశ్న: వాతావరణ మార్పుల వల్ల పంటను ఎలాంటి పురుగులు ఆశించి నష్టపరుస్తాయి.

జవాబు: ముఖ్యంగా ఉల్లికోడు, రసం పీల్చే పురుగులు, దోమ ఆశించే అవకాశాలు ఉన్నాయి. పురుగులను నివారించడానికి రైతులకు ముందస్తు చర్యలు తెలియజేస్తాం.

ప్రశ్న: ఏయే పురుగులపై పరిశోధనలు చేస్తున్నారు.

జవాబు: వరిలో ఉల్లికోడు తెగుళ్లపై, వేరుశనగలో రసం పీల్చే పురుగులు, నువ్వుల్లో దోమ నియంత్రణపై పరిశోధనలు నిర్వహిస్తున్నాం. ఈ పరిశోధనల ఫలితాలను రైతులకు అందిస్తాం.

ప్రశ్న: డ్రోన్ల వినియోగం సత్ఫలితాలనిస్తోందా...

జవాబు: వరిలో ఆశించే పురుగుల నివారణకు వాడాల్సిన మందులను తగు మోతాదులతో అందించేందుకు డ్రోన్ల ద్వారా సులభంగా ఉంటుంది. తద్వారా రైతులకు సమయం ఆదాతోపాటు ఖర్చు కూడా తగ్గించవచ్చు.

ప్రశ్న: ఇంకా ఏయే కార్యక్రమాలు చేపడుతున్నారు.

జవాబు: వేరుశనగలో బ్రీడర్‌సీడ్ విత్తనోత్పత్తి చేపడుతున్నాం. రైతుల పొలాల్లో ప్రతి యేటా 300 నుంచి 400 క్వింటాళ్లు పండించి వాటిని సేకరించి మళ్లీ అన్నదాతలకు సబ్సిడీ ద్వారా అందిస్తున్నాం. అంతేకాక వ్యవసాయ శాఖ నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొంటున్నాం. ఫోన్ కాల్, వాట్సాప్ సందేశాల ద్వారా రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కారం చూపుతున్నాం. అంతేకాక ప్రతి మంగళవారం వీడియో ప్రోగ్రాం, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్నాం.

వరాలివ్వవే తల్లీ...


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తి

చెన్నూరు. ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : దశ మహా విద్యల్లో ఒకరైన సాత్విక తేజోరూపమైన మాతంగి రాజశ్యామలాదేవి నాలుగోరోజు గ్రామోత్సవం మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీలో వైభవంగా జరిగింది. వార్షికోత్సవంలో భాగంగా గత నెల 30వ తేదీన అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమై 3, 4, 5, 6 రోజుల్లో రోజుకొక గ్రామంలో అమ్మవారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. నాలుగోరోజు ఉప్పరపల్లెలో ఉత్సవమూర్తులు వీధివీధినా మంగళవాయిద్యాలు, బాణసంచా, కోలాటం మధ్య ఊరేగింపు నిర్వహించారు.

'ఏపీజీబీ కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి'

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి విజయజ్యోతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బ్యాంకు రైతులు, పేదలకు మెరుగైన సేవలందిస్తోందన్నారు.

10 నుంచి ఇంటింటికీ న్యాయ ప్రచారం

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ ఆవరణలో గల జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 18 ఏళ్లలోపు గల పిల్లలకు పుట్టకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన పిల్లల తల్లిదండ్రులు ఇలాంటి చికిత్స సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఇంటింటి ప్రచారాన్ని ఫిబ్రవరి 10 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నారు.

రాష్ట్రంలో రాజకీయాన్ని చింతపండు వ్యాపారంగా మార్చిన జగన్‌రెడ్డి

● బీజేపీ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాజకీయ రంగాన్ని చింతపండు వ్యాపారంగా మార్చారని బీజేపీ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డిలాంటి నియంత రాజకీయరంగంలో ఉండకూడదన్నారు. ఆయన పత్రికలో మరోసారి గెలుస్తామని, 30 ఏళ్ల పాటు నేనే సీఎం అంటూ జగన్‌రెడ్డి పగటి కలలు కంటున్నారన్నారు. జగన్‌రెడ్డి కంటున్న పగటి కలలను ఆపార్టీలో ఉండే చోటామోటా నాయకులే నమ్మడంలేదన్నారు. గత ఎన్నికలకు ముందు కూడా తానే 30 సంవత్సరాల పాటు సీఎంగా ఉంటానని, రాష్ట్రంలో గల 175 ఎమ్మెల్యే సీట్లకు గాను 175 సీట్లు మావేనని, అలాగే ఉన్న 25 ఎంపీ సీట్లకు 25 ఎంపీ సీట్లు వైనాట్ వైసీపీ అంటూ గొప్పలు చెప్పారని గుర్తు చేశారు. మాట తప్పడం, మడమ తిప్పడం జగన్‌రెడ్డికి బాగా అలవాటేనన్నారు.పైపెచ్చు అన్ని పార్టీలు ఏకమైనా వెంట్రుక కూడా పీకలేరంటూ పలు సందర్భాల్లో విర్రవీగిన సంగతి తెలిసిందేనన్నారు. ఆయన వెంట్రుకలు పీకడం కాదు కదా, ఏకంగా గుండు కూడా కొట్టి చూపించామన్నారు. ఆయనతో పాటు ఆయన పార్టీకి చెందిన నాయకులు అవినాష్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి, విజయసాయిరెడ్డి దోచుకోవడం ఎక్కువైందన్నారు. ఇప్పటికీ వైసీపీలో ఉండలేక అక్కడ ఇమడలేక నానా తంటాలు పడుతున్న నాయకులంతా ఆ పార్టీకి గుడ్‌బై కొట్టి బయటపడాలని కోరారు.

మతిస్థిమితంలేని మహిళ అప్పగింత

అంగన్వాడీ వర్కర్లు, మహిళా పోలీసుల ఔదార్యం



కుటుంబీకులకు రషీదను అప్పగిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా పోలీసులు

కొండాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గండ్లూరు గ్రామంలో మతిస్థిమితం లేక పడిపోయిన మహిళ పట్ల గురువారం అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా పోలీసుల ఔదార్యంతో కుటుంబీకులకు అప్పగించారు. మతిస్థిమితం లేక నేషనల్-హైవే పక్కన పడి ఉన్న మహిళను అంగన్‌వాడీ వర్కర్ డేరా జ్యోతి గుర్తించారు. తోటి వర్కర్లు పద్మ, తులసి, రాణి, మహిళా పోలీసులు వరలక్ష్మి, భానుశ్రీతో కలిసి ఆమెకు ఆహారం ఇచ్చి సపరిచర్యలు చేశారు. ఆమె వివరాలు తెలపలేకపోవడంతో ఫొటో తీసి మహిళా పోలీసులు తమ వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేశారు. దీన్ని గుర్తించిన కడప మహిళా పోలీసులు కడప రవీంద్ర నగర్‌లో గత నెల 27న మిస్సింగ్ అయిన షేక్ రషీదగా గుర్తించారు. దీంతో వారి బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు కొండాపురం పోలీస్ స్టేషన్‌కు వచ్చి రషీదను తీసుకెళ్లారు. రషీద మతిస్థిమితంలేక తిరుగుతోందని, తమకు వెంటనే వివరాలు తెలియజేసినందుకు మహిళా పోలీసులు, అంగన్‌వాడీలకు కృతజ్ఞతలు తెలిపారు. తొందరగా గుర్తించి వారి బంధువులకు అప్పగించినందుకు అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా పోలీసులను ఎస్ఐ విద్యాసాగర్ అభినందించారు.

జోరుగా నూర్పిళ్లు

తగ్గిన దిగుబడులు ● పడిపోయిన శనగ ధరలు ● ఆందోళనలో రైతన్నలు



కుప్పలుగా పోసిన శనగ పంట

రాజుపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నలకు పంట చేతికొచ్చే సమయంలో నిరాశే తప్ప సరైన దిగుబడులు రాకపోవడంతో రైతు పరిస్థితి దయనీయంగా మారింది. ఎన్నో ఆశలతో రబీ సాగులో శనగపంట సాగు చేస్తే తీరా పూత దశలో నెలరోజులు తుపాన్ ప్రభావంతో ముసురు, వానలు కురవడంతో పంట పూర్తిగా దెబ్బతినింది. దీంతో దిగుబడులు బాగా తగ్గడం, దిగుబడులకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో శనగ రైతు నిరాశకు గురవుతున్నారు. చిన్నశెట్టిపల్లె, పొట్టిపాడు, కొత్రపాడు, టంగుటూరు, గోపాయపల్లె, పగిడాల తదితర గ్రామాల్లో 15,428 ఎకరాలు పంట సాగులో ఉందని అధికారులు తెలిపారు. ఎకరాకు విత్తనం, సేద్యం, మందు ఖర్చు, కూలీల, కౌలు ఖర్చులు సహా రూ.35 నుంచి రూ.40వేలు వస్తే కనీసం 4నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుందనుకున్నారు. అది కూడా వర్షంతో శనగలు కొంత మేర నల్లబారడంతో మార్కెట్లో విలువ కూడా తగ్గిందని రైతులు వాపోతున్నారు. క్వింటా ధర రూ.6500 పలుకుతున్న శనగ ప్రస్తుతం ధర రూ.5400 పకలడంతో దిగుబడి ఎకరా రూ.22వేలు వస్తే ఎకరా పంట నూర్పిళ్లు, శనగ కట్టె పీకేందుకు, కూలీలకు రూ.6 వేలు ఖర్చు వస్తోంది. మిగతా రూ.30వేలతో కౌలు రైతుకు గుత్త కూడా రావడంలేదని వివరించారు. చిన్నశెట్టిపల్లె, పొట్టిపాడు గ్రామాల్లో శనగ తప్ప ఇతర పంటలు సాగు చేసే పరిస్థితి లేదు. ఇలాంటి దిగుబడులు వస్తే రైతు చేసిన అప్పులు తీరేదెప్పుడు, పది కాసులు మిగిలేదెప్పుడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.480 ఇన్సూరెన్స్ కట్టుకున్నాము. కనీసం పంట కన్నా ఇన్సూరెన్స్ వర్తింపజేస్తే రైతులు కొంత మేర నష్టాలు పూడ్చుకునే వీలుంటుందని రైతులు తెలిపారు. అధికారులు చొరవ తీసుకుని పంట పరిశీలించి ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని తెలిపారు.

కౌలు డబ్బు కూడా రాలేదు



15 ఎకరాల్లో శనగ సాగు చేస్తే రూ.2.25 లక్షలు కౌలు ముందే చెల్లించినా కనీసం కౌలు డబ్బు కూడా రాలేదు. పెట్టుబడి పూర్తిగా నష్టపోతున్నా. కూలీలు మిషన్ల ద్వారా ఎకరాకు రూ.5వేల నుంచి రూ.6వేలు ఖర్చు వస్తోంది. కొందరు రైతులు దిగుబడి తగ్గడంతో చేను మీదే మిషన్ల ద్వారా ఆడించుకుంటూ కొంతమేర ఖర్చు తగ్గించుకుంటున్నారు. ప్రభుత్వం ఇన్సూరెన్స్ ఇస్తే తప్ప వచ్చే ఏడాది శనగ పంటపై మొగ్గుచూపలేరు. లేదంటే పంట మానుకోవడమే ఉత్తమమని భావిస్తున్నా.

ముక్కర్ల వెంకట్రామిరెడ్డి, రైతు

యంత్రం ద్వారా పొలంపైనే నూర్పిళ్లు చేస్తున్న దృశ్యం



ఉన్నతాధికారులకు నివేదిస్తా



గ్రామాల్లో పంటకోత ప్రయోగం ద్వారా ఐదు ఇంటు ఐదు మీటర్లకు వచ్చిన దిగుబడులు పరిశీలించాను. ఎకరాకు 4నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పంటకోత ప్రయోగాల ద్వారా రైతు ఇన్సూరెన్స్ అధికారులు, గ్రామ ఏఈఓల సమక్షంలో ప్రయోగాలు చేస్తున్నాము. మరో రెండు గ్రామాలు పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతాము.

శివరామ కృష్ణారెడ్డి, ఏఓ



కుప్పగా పోసిన శనగలు

ఘనంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



మాట్లాడుతున్న దత్త విజయానంద తీర్థస్వామి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం, సహస్ర లక్ష్మీ యాగాలను ఘనంగా నిర్వహించారు. గురువారం మైసూరు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థస్వామి ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి, దత్తాత్రేయస్వామి, కాశీవిశ్వేశ్వరుడు, ఆంజనేయస్వామి, సుదర్శన యోగ నరసింహస్వామి, చాముండేశ్వరీదేవి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సత్యనారాయణ స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలకరించి శాస్త్రోక్తంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం, సహస్ర లక్ష్మీయాగం నిర్వహించారు. విజయానంద తీర్థ మాట్లాడుతూ సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించడం వలన అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయంలో వ్రతం చేసినంత పుణ్యఫలం లభిస్తుందన్నారు. ఆలయంలోని దేవతామూర్తులు మహిమగలవారని, భక్తిశ్రద్ధలతో స్వామివారిని పూజిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయన్నారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, సహస్ర లక్ష్మీయాగాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పి.వెంకటాపురం వద్ద ఆటోలో తీసుకెళుతున్న రేషన్ బియ్యాన్ని ఎర్రగుంట్ల పోలీసులు గురువారం పట్టుకున్నారు. 17మూటల్లో 850 కిలోల బియ్యం, ఆటోను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. బియ్యం రవాణా చేస్తున్న శ్రీరాముల రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆదర్శ పనితీరే అభివృద్ధికి మూలం



ఆదర్శ ఉద్యోగిగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డ్రైవర్ గంగయ్య

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల ఆదర్శ పని తీరే సంస్థ అభివృద్ధికి మూలమని ఎంవీఐ శేఖర్ రావు, ఆర్టీసీ డీఎం నిరంజన్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో వారు మాట్లాడుతూ ఆర్టీసీ మనుగడ కోసం ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగానే రెండో స్థానంలో ఉన్నామని, ఆ ప్రతిభ ఉద్యోగులకే దక్కుతుందన్నారు. బస్సులను కండీషన్‌లో ఉంచుతున్న గ్యారేజ్ మెకానిక్‌లు, ప్రయాణికుల అవసరాల మేరకు బస్సులను ఏర్పాటు చేయడంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ బీఎస్ నాయక్ కృషి ప్రసంశనీయమన్నారు. ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ రుణాల దరఖాస్తులకు గడువు పెంచాలి

మంత్రిని కోరిన డైరెక్టర్ నాగరాజు



బీసీ సంక్షేమ శాఖమంత్రి సవితను కలిసిన డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవడానికి కేవలం వారం రోజుల గడువు సరిపోదని గడువు పెంచాలని వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు మంత్రి సవితను కోరారు. గురువారం విజయవాడలోని బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రి సవితను కలిసి నాగరాజు వినతి పత్రం అందజేశారు. తక్కువ గడువు వుండడంతో కుల ఆదాయ ధ్రువపత్రాలు సమయానికి సచివాలయాల్లో ఇవ్వక పోవడం వలన రుణాలకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారన్నారు. కనుక దరఖాస్తులకు గడువు పెంచాలన్నారు.

బాలామృతాన్ని సద్వినియోగం చేసుకోండి

మైలవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో అందించే అధిక పోషక విలువలు కలిగిన బాలామృతంను సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ రాజేశ్వరిదేవి సూచించారు. గురువారం దొమ్మరనంద్యాల అంగన్వాడీ సెంటర్-3లో అక్షయ ఫౌండేషన్ అందించిన సీనియర్, జూనియర్ బాలామృతం పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ ఎస్.గౌషియా, అంగన్వాడీ, హెల్త్ సిబ్బంది, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల పరిరక్షణకు ఉద్యమిస్తాం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్ల పరిరక్షణకు ఉద్యమిస్తామని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. నాగార్జున ఐటీఐ కళాశాలలో సంఘం సమావేశం నిర్వహించారు. హాస్టల్ ధరలకు తగిన విధంగా ప్రభుత్వం మెనూ చార్జీలను చెల్లించడంలేదని విమర్శించారు. ఊరిబయట హాస్టళ్లను ఏర్పాటు చేయడం వలన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. నాగార్జున ఐటీఐ నుంచి మహాత్మాజ్యోతిరావుపూలే విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాగార్జున, పార్థసారథి, వెంకట్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

టేకూరుపేట పీహెచ్‌సీ తనిఖీ

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మినాయక్ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. డెంగ్యూ, మలేరియా కీటక జనిత వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫ్రైడే డ్రైడే తప్పక చేయాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి నిత్యపూజయ్య రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి సాధు వెంకటేశ్వర్లు, రఘురాం, బాలాజీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సివిల్ సప్లై గోడౌన్ తనిఖీ

ముద్దనూరు ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి):కొత్తపల్లె వద్ద నున్న సివిల్ సప్లై గోడౌన్‌ను గురువారం ఆర్డీఓ సాయిశ్రీ తనిఖీ చేసి స్టాక్ రిజిస్టార్‌ను పరిశీలించారు. తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించి వీఆర్వోలకు పలు సూచనలు చేశారు. రెవెన్యూ సదస్సు, భూముల రీసర్వేపై ఆరాతీశారు. ప్రజలకు సంతృప్తికరంగా ఉండేలా సమస్యలను పరిష్కరించాలన్నారు. తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే గుర్తింపు

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యే భవిష్యత్తులో మంచి సంపద, సమాజంలో గుర్తింపు లభిస్తుందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు సరస్వతి అన్నారు. గురువారం స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వార్డెన్ మునెయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహించారు. టెన్త్ స్టడీ మెటీరియల్ ఆమె పంపిణీ చేశారు. స్థానిక వార్డెన్లు మునెయ్య, నరసింహారెడ్డి, బాలుడు, వెంకటేశ్వరమ్మ, విజయ ఉపాధ్యాయులు వీరనారాయణ, నారాయణ స్వామి, సిబ్బంది విద్యార్థినులు విద్యార్థులు పాల్గొన్నారు.

మందక్రిష్ణకు 'పద్మశ్రీ'తో సముచిత గౌరవం



మందక్రిష్ణను అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట యోధుడు, వృద్ధులు, వికలాంగుల హక్కుల కోసం పరితపించిన మందక్రిష్ణ మాదిగకు పద్మశ్రీ ఇవ్వడం సముచితమేనని వికలాంగుల హక్కుల పోరాట కమిటీ జాతీయ కోర్ కమిటీ ఛైర్మెన్ గురిజాల రామ్మోహన్ రెడ్డి కొనియాడారు. గురువారం హైదరాబాదులో మందక్రిష్ణ మాదిగను ఆయన ఇంట్లో వీహెచ్‌పీఎస్ నేత కలిసి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై హర్షం ప్రకటించారు. మందక్రిష్ణ నడిపిన చారిత్రక పోరాటంతో ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను రూపొందించిన ఘనత సాధించారన్నారు. మందక్రిష్ణ మాదిగ మరిన్ని అవార్డులు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎంవీఐ

బద్వేలు/బద్వేలు టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను పాటించాలని, మద్యంతాగి వాహనాలు నపడరాదని, సీఐ రాజగోపాల్, ఎంవీఐ శేఖర్‌రావు సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు ఆర్టీఓ కార్యాలయంలో స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పించారు. బస్సులకు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు, అగ్నిప్రమాద నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. స్కూల్ బస్సులకు అన్ని రకాల పత్రాలు కలిగి ఉండాలని, బస్సు సరైన కండీషన్‌లో ఉందో లేదో ముందే జాగ్రత్త పడాలన్నారు. స్కూల్ వాహనాలకు ప్రమాదం జరిగితే సంబంధిత డ్రైవర్, యాజమాన్యంపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎస్ఐ సత్యనారాయణ, అగ్నిమాపక సిబ్బంది స్కూల్ డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

నులిపురుగులు చేరితే అనారోగ్యం దరిచేరినట్లే

టాస్క్ ఫోర్స్ మీటింగ్‌లో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నులిపురుగులు చేరితే అనారోగ్యం దరిచేరినట్లేనని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఫిబ్రవరి 10 జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ మీటింగ్‌లో డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ నులిపురుగులు చేరిన పిల్లలకు రక్తహీనత, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం, పోషకాలు లోపించి నీరసం లాంటి లక్షణాలువుంటాయన్నారు. నులిపురుగుల సంక్రమణను తగ్గించడానికి గోళ్లను చిన్నవి కత్తిరించి శుభ్రంగా వుంచుకోవాలన్నారు. శుభ్రమైన నీటిని తాగడం, పరిసరాలు శుభ్రంగా వుంచుకోవాలన్నారు. ఆహారాన్ని కప్పి వుంచడం, కూరగాయలు, పళ్లు శుభ్రమైన నీటితో కడగాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, కాలేజీల్లో 19ఏళ్ల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించి తీరాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ హైమావతి, అర్బన్ వైద్య అధికారులు నజీర్‌బాషా, మౌనిక, హిమబిందు, భరత్, అలీం, పద్మిని, హెల్త్ కోఆర్డినేటర్లు వెంకటేశ్వర్లు శోభారాణి, హెచ్ఈఓ సుబ్బరాయుడు, సూపర్‌వైజర్ జయమ్మ సీఓలు సుబ్బారెడ్డి శ్రీదేవి నాగజ్యోతి మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యార్థుల కష్టాలు అధికారులకు పట్టవా'

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసర వస్తువులు, కాలానుగుణంగా పరిస్థితులకు అనుకూలంగా స్టైఫండ్ పెంచాలని విద్యార్థులు చేస్తున్న ఆందోళన, వారి కష్టాలు అధికారులకు పట్టవా అని పశువైద్య కళాశాల విద్యార్థులు నిలదీస్తున్నారు. గురువారం పశువైద్య కళాశాల విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన 4వ రోజుకు చేరింది. కళాశాల ప్రాంగణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు బహిష్కరించి సమ్మె బాట పట్టారు. మెడికల్ విద్యార్థులతో సమానంగా తమకు స్టైఫండ్ పెంచే వరకూ సమ్మెను విరమించబోమన్నారు.

రాజకీయాన్ని వ్యాపారం చేసిన జగన్ : ఎమ్మెల్యే

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాజకీయ రంగాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చింతపండు వ్యాపారంలా మార్చాడని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. ప్రజలకు ఎంత చేసినా ఇంకా చేయాలనుకునే వారే రాజకీయరంగంలో ఉండాలే కానీ మళ్లీ అధికారంలోకి వస్తామో.. రామో, అని ఎక్కడ బడితే అక్కడ దోచుకోని, దాచుకోవడమే జగన్‌రెడ్డి ఓ పనిగా సాగించారని ఆరోపించారు. 'మరోసారి గెలుస్తామని, 30 ఏళ్ల పాటు నేనే సీఎం' అంటూ జగన్‌రెడ్డి ఆయన పత్రికలో రాయిస్తూ పగటి కలలు కంటున్నారన్నారు. ఆశల పల్లకీలో ఊరేగుతూ జగన్‌రెడ్డి వ్యాఖ్యలు చేస్తున్న తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. అన్ని పార్టీలు ఏకమైనా వెంట్రుక కూడా పీకలేరంటూ పలు సందర్భాల్లో విర్రవీగిన ఆయనకు ఏకంగా గుండు కొట్టి చూపించామన్నారు. అవినాష్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విజయసాయిరెడ్డి ఏకంగా సూపర్‌మార్కెట్ తెరవగా కింది స్థాయి నేతలు ఎక్కడబడితే అక్కడ అంగళ్లు తెరిచారని దుయ్యబట్టారు. కూటమి పేరుతో జత కట్టిన టీడీపీ, బీజేపీ, జనసేన విజయవంతంగా గత ఎన్నికల్లో అధికారం చేపట్టి ప్రజారంజకపాలన సాగిస్తోందన్నారు. చివరికి జగన్‌రెడ్డిని ఏకాకిని చేసి రాష్ట్రంలో వైసీపీని నామరూపాలు లేకుండా చేస్తామన్నారు. పార్టీలో ఇమడలేని నేతలంతా జగన్‌కు గుడ్‌బై కొట్టాలన్నారు.

'ఉడకని అన్నంతో విద్యార్థులకు అగచాట్లు'



పాఠశాల వద్ద మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి ప్రసాద్

జమ్మలమడుగు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల ప్రాథమిక పాఠశాలలో ఉడకని అన్నంతో విద్యార్థులు అగచాట్లు పడుతున్నారని తెలుస్తోంది. గురువారం సీపీఐ కార్యదర్శి, స్థానికులు, విద్యార్థులు చెప్పిన వివరాల మేరకు పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఉడకని అన్నంపై హెడ్మాస్టర్ నాగరాజుతో చర్చించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు ఉడకని అన్నం పెట్టినట్లు, బియ్యం సైతం సక్రమంగా లేవని తెలిపారు. సీఆర్‌పీల పనితీరు సమస్యలపై విద్యాశాఖ అధికారులు వెంటనే తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని సీపీఐ ప్రసాద్ తెలిపారు.

గౌరవవేతనాలు విడుదల చేయాలి

ప్రభుత్వ సలహాదారు షరీఫ్‌కు వినతి పత్రం

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇమామ్, మౌజన్లకు పెండింగ్ గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేయించాలని ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షరీఫ్ ప్రొద్దుటూరుకు వచ్చిన సందర్భంగా ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజన్లకు రూ.5వేలు గౌరవ వేతనం ఇవ్వడానికి ఏటా రూ.90 కోట్లు ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్దంగా వుందని ముఖ్యమంత్రి చంద్రబాబు, మైనార్టీ మంత్రి ఫరూక్ వెల్లడించారన్నారు. జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రీ పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, కార్యదర్శి రఫీ మీడియా కార్యదర్శి అస్లాం ముక్తార్ అల్లాబకాష్ హనీఫ్ పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, కమిషనర్

చాపాడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నక్కలదిన్నెలో కొత్తగా నిర్మించిన శ్రీరామ దేవాలయంలో గురువారం స్వామివారికి పురోహితులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు హోమం నిర్వహించారు. 8న శనివారం సీతారామ, లక్ష్మణ విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, సీఏబీపీ కమిషన్ శెట్టిపల్లె రామసుందర్‌రెడ్డి, పూజల్లో పాల్గొన్నారు. శివాలయం ఛైర్మన్ రామప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్తను కాల్వల్లో వేయరాదు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోని చెత్తను కాల్వల్లో వేయరాదని కమిషనర్ వెంకటరామిరెడ్డి సూచించారు. స్థానిక కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి, కూటమి నేత నవనీశ్వరరెడ్డి కన్నెలూరు గ్రామాన్ని తనిఖీ చేశారు. ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్డు సమస్యలు, డ్రైనేజీ ఇబ్బందులపై ప్రజలతో అడిగి తెలుసుకున్నారు.

బీఎల్‌ఓలకు పూర్తి వేతనం చెల్లించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బీఎల్‌ఓలకు పూర్తిస్థాయిలో వేతనాలు చెల్లించాలని గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ నేతలు డిప్యూటీ తహసీల్దారు సాయినాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యక్షుడు పెద్దమస్తాన్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం బీఎల్‌ఓలను నియమించినా వారికి ఇంతవరకూ వేతనం చెల్లించలేదన్నారు.

ప్లాస్టిక్ కవర్లు అమ్మితే కఠినచర్యలు

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): దుకాణాలు, హోటళ్లలో ప్లాస్టిక్ కవర్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ శేషఫణి హెచ్చరించారు. ఎర్రగుంట్లలోని పలుదుకాణాల్లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. చాలా దుకాణాల్లో ప్లాస్టిక్ దొరకడంతో జరిమానా విధించారు. ఇక ముందు తానే స్వయంగా ప్లాస్టిక్‌పై తనిఖీ నిర్వహిస్తానని హెచ్చరించారు.